




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక          ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 270 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం గురువారం 6 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 270 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM THU 6 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## దేవరపల్లిలో జగన్ పర్యటన.. శ్రుతిమించిన శ్రేణుల ఉత్సాహం!


- తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో జగన్ పర్యటన
- వైసీపీ కార్యకర్తల అతి ఉత్సాహంతో తీవ్ర గందరగోళం
- హెలిప్యాడ్ వద్ద బారికేడ్లను తోసుకువచ్చిన శ్రేణులు
- బైక్‌లతో విన్యాసాలు, సైలెన్సర్లు తీసివేసి హంగామా
- కార్యకర్తల తీరుతో తీవ్ర ఇబ్బందులు పడిన స్థానికులు



పెన్ పవర్ డెస్క్:తూర్పుగోదావరి జిల్లా, గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లిలో వైసీపీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా పార్టీ కార్యకర్తలు ప్రదర్శించిన అతి ఉత్సాహం

- మిగతా 2లో

## విశాఖ రూపురేఖలు మార్చే మాస్టర్ ప్లాన్.. సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష



- విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రూ.9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యం
- ప్రభుత్వ వాటాగా రూ.4 లక్షల కోట్లు, ప్రైవేట్ రంగం నుంచి రూ.5.30 లక్షల కోట్లు
- మూలపేట పోర్టు నుంచి రాజమండ్రి అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు అభివృద్ధి
- ఏఐ డేటా సెంటర్లు, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పర్యాటకంపై ప్రత్యేక దృష్టి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అత్యంత కీలకమైన విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ బృహత్ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ. 9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ సమీక్షా సమావేశంలో వీఈఆర్ ప్రాజెక్టు ఆర్థిక స్వరూపాన్ని, కార్యాచరణను అధికారులు

- మిగతా 2లో

# రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు

## కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శనాస్త్రాలు

- దేవరపల్లిలో పొగాకు రైతులను కలిసిన వైఎస్ జగన్
- కూటమి పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తీవ్ర ఆరోపణలు
- పొగాకుకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన
- వైసీపీ హయాంలో ఉన్న సున్నావడ్డీ, రైతు భరోసా పథకాలు రద్దు చేశారని విమర్శ
- ప్రభుత్వం సిండికేట్లతో కుమ్మక్కై రైతులను మోసం చేస్తోందని జగన్ ధ్వజం



పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్.. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుప డ్డారు. ప్రభుత్వ విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం పర్యటించిన ఆయన, పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విధ్వంసం సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు. పొగాకు బ్యారన్లను పరిశీలించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు. “మా ప్రభుత్వ హయాంలో కిలో పొగాకుకు సగటున రూ. 289 ధర పలికింది. కొందరు రైతులు రూ. 365 వరకు కూడా పొందారు. కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వం

- మిగతా 2లో



## వైఫల్యాలకు భయపడొద్దు.. కఠిన మార్గాన్నే ఎంచుకోండి

### అమృత వర్సిటీ స్నాతకోత్సవంలో నారా లోకేశ్

- అమరావతిలోని అమృత యూనివర్సిటీ స్నాతకోత్సవం
- గౌరవ అతిథిగా మంత్రి నారా లోకేశ్... విద్యార్థులకు దిశానిర్దేశం
- భవిష్యత్ అవకాశాల కోసం ఏపీ విద్యారంగంలో సమూల మార్పులు
- యువత ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని మంత్రి లోకేష్ ఆకాంక్ష
- వైఫల్యాలకు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి
- యువత కలల సాకారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ

పెన్ పవర్ డెస్క్:ప్రపంచం గతంలో ఎన్నడూ లేనంత వేగంగా మారుతోందని, కృత్రిమ మేధస్సు (ఏఐ), క్వాంటం ఇంజనీరింగ్ వంటి నూతన సాంకేతికతలు సరికొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల

- మిగతా 2లో

## హైడ్రా చీఫ్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ.. 8 ప్రముఖ కాలేజీల అక్రమాల రట్టు!

- నకిలీ ఎన్‌ఓసీ పత్రాలను తయారు చేసిన ముఠా గుట్టు రట్టు
- ఇంటర్ బోర్డు అనుమతుల కోసం దొంగ సంతకాలతో నకిలీ ఎన్‌ఓసీలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు

పెన్ పవర్ డెస్క్:హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న 'హైడ్రా' పేరును వాడుకుని కొందరు అక్రమాలకు యత్నించిన తీరు తీవ్ర కలకలం రేపుతోంది. స్వయంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ 'ఫైర్ ఎన్‌ఓసీ' (బీజా) పత్రాలను తయారు చేసిన ఒక ముఠా గుట్టు రట్టయింది. ఏకంగా నగరంలోని 8 ప్రముఖ ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఈ నకిలీ సర్టిఫికెట్ల ఆధారంగా గుర్తింపు పొందేందుకు యత్నించడం విద్యాశాఖతో పాటు పోలీసు వర్గాలను

- మిగతా 2లో



## సీఎం విజయ్ తొలి బడ్జెట్‌లో విద్యా రంగానికి పెద్దపీట.. పాఠశాల విద్యకే రూ.44,527 కోట్లు




- కామరాజర్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు
- 10 వేల పాఠశాలల్లో సూపర్ క్లీన్ క్యాంపస్ పథకం
- కళాశాల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల కోసం రూ.2,000 కోట్లు
- సంక్షేమ పథకాలకు భారీ నిధుల కేటాయింపు
- అదనంగా రూ.16 వేల కోట్ల ఆదాయం రాబట్టడమే లక్ష్యం

- మిగతా 2లో

## దిగొచ్చిన మెటా.. భారత్‌కు క్షమాపణ చెప్పిన మార్క్ జుకర్‌బర్గ్

- భారత ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పిన మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్
- డీప్‌ఫేక్‌లు, అభ్యంతరకర కంటెంట్ వ్యాప్తిపై చింతిస్తున్నట్లు వెల్లడి
- ప్రధాని మోదీ పోస్ట్ తొలగింపు వ్యవహారంలో కీలక పరిణామం
- తప్పులు జరిగాయని అంగీకారం, సేఫ్ హార్బర్ రక్షణపై కేంద్రం హెచ్చరిక
- ఢిల్లీలో ఐటీ కార్యదర్శితో మెటా ప్రతినిధుల ఉన్నత స్థాయి సమావేశం

- మిగతా 2లో






## ఏఐతో భయపడొద్దు.. భారత్‌కు లాభాలే ఎక్కువ

- భారత్‌లో ఏఐతో ఉద్యోగాల ముప్పు తక్కువేనన్న ప్రపంచ బ్యాంకు
- అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కేవలం 4.5 శాతం ఉద్యోగాలకే ముప్పు
- 16.2 శాతం ఉద్యోగాల్లో ఉత్పాదకత పెరిగే అవకాశం
- చిన్న, తక్కువ ఖర్చు ఏఐ వ్యవస్థలపైనే దృష్టి పెట్టాలని సూచన
- వైద్యం, విద్య, వ్యవసాయంలో ఏఐతో పెద్ద మార్పులు సాధ్యమని నివేదిక
- విద్యుత్, ఇంటర్నెట్, నైపుణ్యాలపై పెట్టుబడులు అవసరమని సూచన

- మిగతా 2లో

## 20నిమిషాల్లో 7పేలుళ్లు.. దద్దరిల్లిన దుబాయ్



పెన్ పవర్ డెస్క్: వరుస పేలుళ్లతో దుబాయ్ దద్దరిల్లింది. జెబెల్ అలీ పారిశ్రామిక ప్రాంతంలో మంగళ వారం రాత్రి భారీ పేలుళ్లు చోటుచేసుకు న్నాయి. కేవలం 20 నిమిషాల్లోనే 7 భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు.

- మిగతా 2లో

## నిరసనల్లో పాల్గొనే యువత పట్ల అత్యంత సహనంతో వ్యవహరించాలి

- హింసను అదుపు చేసే క్రమంలో బలగాలు జాగ్రత్తగా ఉండాలన్న సుప్రీంకోర్టు
- యువత ఎదురుదాడికి దిగితే పరిస్థితులు మరింత దారి తప్పే ప్రమాదముందని హెచ్చరిక
- యువత హింసాత్మక మార్గాల వైపు వెళ్లకుండా చూడటమే అధికారుల ప్రాథమిక విధి అని వ్యాఖ్య



- మిగతా 2లో

## విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్...

- విశాఖలో పీవీ సింధు స్పోర్ట్స్ అకాడమీకి శ్రీకారం
- భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్
- అరిలోవ తోటగరువులో సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ నిర్మాణం
- అకాడమీ నమూనా, సౌకర్యాలను పరిశీలించిన మంత్రి
- కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాశాఖ మంత్రి, టీడీపీ నేతలు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# వైఎస్ షర్మిల ముందు పెద్ద టాస్క్.. రేసులో ఎక్కడ?

కాంగ్రెస్ ఏపీ చీఫ్ వైఎస్ షర్మిలకు బిగ్ టాస్క్ భయపెడుతోంది. ఆంధ్రప్రదేశ్ లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేయనుంది. పీసీసీ చీఫ్ షర్మిల అన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు బరిలో ఉండాలని నేతలకు ఆదేశాలు జారీ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బలపడి పార్టీ ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆమె పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో అక్టోబర్ లేదా నవంబర్ లోపు ఎన్నికలు నిర్వహించేందుకు ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు వేగవంతం చేసింది.ఎన్నికల సన్నాహాలను ప్రారంభించింది. ఏపీలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం మరియు ప్రభుత్వం దృష్టి పెట్టాయి. ఆగస్టు 6న మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులతో కీలక సమావేశం జరగనుంది.అన్ని ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా గ్రామ స్థాయి నుండి బలోపేతంపై దృష్టి పెట్టింది. అన్ని స్థానాల నుంచి పోటీ చేయాలని నిర్ణయించింది.

**పోటీ చేసేందుకు...**

అయితే కాంగ్రెస్ లో పోటీ చేయడానికి అభ్యర్థులు ఎంత మేరకు దొరుకుతారన్నదే ప్రశ్న. 2014 రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ లో పూర్తిగా పట్టును కోల్పోయింది. ఓటు బ్యాంకును కూడా కోల్పోయింది. 2014 ఎన్నికల నుంచి ఏ ఎన్నికలు జరిగినా సింగిల్ డిజిట్ ఓట్ల శాతానికే పరిమితమయింది. పార్టీ అధినాయకత్వం ఎన్ని ప్రయోగాలు చేసినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. రఘువీరారెడ్డి ని పీసీసీ చీఫ్ గా మొదలు పెట్టి అనేక మందిని మార్చారు. చివరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ సోదరి వైఎస్ షర్మిలను పార్టీ చీఫ్ గా నియమించారు. అయితే షర్మిలను నియమించినప్పటికీ పార్టీ ఏమాత్రం పుంజుకోలేదు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు మొత్తాన్ని జగన్ ఎగరేసుకుని వెళ్లడంతో ఆ పార్టీ కోలుకునే పరిస్థితి కనిపిచండం లేదు.

**తొలినాళ్లలో జోరుగా జిల్లాలు...**

వైఎస్ షర్మిల కూడా తొలినాళ్లలో కొంత జోరుగా జిల్లాలు పర్యటనలు చేసినప్పటికీ రాను రాను ఆమె ఎక్స్ వేదికగా స్పందించడం, మీడియా సమావేశాలకే పరిమితమయ్యారు. వైఎస్ షర్మిల ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. కానీ అంతకు ముందు కూడా షర్మిల పెద్దగా రాష్ట్రంలో పర్యటించలేదు. ఏదైనా కార్యక్రమం ఉంటే విజయవాడ వచ్చి పాల్గొని వెళుతున్నారు. మోదీ ప్రభుత్వంపై విమర్శలు చేయడం, జగన్ పై కుటుంబ సమస్యలు ప్రస్తావిస్తుండటాన్ని స్థానిక కాంగ్రెస్ క్యాడర్ నుంచే పెద్దగా మద్దతు ప్రకటించడం లేదు. చంద్రబాబు ప్రభుత్వంపై అప్పుడప్పుడూ విమర్శలు చేస్తున్నా ఎక్కువగా జగన్ పైనే విమర్శలు చేయడాన్ని పార్టీ నేతలే తప్పుపడుతున్నారు. నాయకులు కూడా వైఎస్ షర్మిలకు సహకరిచడం లేదు. కొందరు హైకమాండ్ కు కూడా షర్మిల వైఖరిపై ఫిర్యాదు చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తప్ప తిరిగి నేతలు యాక్టివ్ కారన్నది వాస్తవం. కానీ అది ఎంత దూరముందో ఎవరికీ తెలియదు.

# వైఫల్యాలకు భయపడొద్దు.. కఠిన మార్గాన్నే ఎంచుకోండి

- మొదటి పేజి తరువాయి

మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఈ భవిష్యత్ అవకాశాలను యువత అందిపుచ్చుకునేలా సిద్ధం చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌లో విద్యా విధానాన్ని సమూలంగా మారుస్తున్నామని స్పష్టం చేశారు. అమరావతిలోని అమృత యూనివర్సిటీ స్నాతకోత్సవానికి భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరుకాగా, మంత్రి లోకేశ్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, “యువత కేవలం ఉద్యోగార్థులుగా మిగిలిపోకూడదు, ఉద్యోగ సృష్టికర్తలుగా మారాలన్నదే మా లక్ష్యం. వారు పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, పరిశోధకులు, నాయకులుగా ఎదగాలి. ఇందుకోసం విశ్వవిద్యాలయాలను, పరిశ్రమలను మరింత దగ్గర చేస్తున్నాం. ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ, యువత నేర్చుకోవడానికి, నూతన ఆవిష్కరణలు చేయడానికి, నాయకత్వం వహించడానికి అవకాశాలు కల్పిస్తున్నాం” అని వివరించారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే అత్యంత ఉత్సాహభరితమైన కాలంలో విద్యార్థులు తమ వృత్తి జీవితాన్ని ప్రారంభిస్తున్నారని, గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో ఒక గొప్ప ఎకోసిస్టమ్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు.

**వైఫల్యాలను చూసి భయపడొద్దు**

పట్టా పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి లోకేశ్ మాట్లాడుతూ, “ఈరోజు మీ ప్రయాణానికి ముగింపు కాదు, ఒక కొత్త ప్రయాణానికి ఆరంభం కావాలి. వైఫల్యాన్ని చూసి ఎప్పుడూ భయపడకండి. వైఫల్యం అంటే మీరు సమర్థులు కాదని కాదు, ప్రయత్నించే ధైర్యం మీకుందని అర్థం. విజయం ఎప్పటికీ ప్రయత్నం విరమించని వారినే వరిస్తుంది. ప్రపంచంలో మార్పు తేగలమనే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి” అని పిలుపునిచ్చారు. ఈ డిగ్రీ కేవలం విద్యార్థులది మాత్రమే కాదని, వారి తల్లిదండ్రుల త్యాగాలు, కుటుంబ సభ్యుల మద్దతు, గురువుల మార్గనిర్దేశం కూడా ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు.

**విలువలతో కూడిన విద్య అమృత ప్రత్యేకత**

అమృత యూనివర్సిటీ అందిస్తున్న విద్యను మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా ప్రశంసించారు. “చాలా విశ్వవిద్యాలయాలు జ్ఞానాన్ని, పట్టాలను అందిస్తాయి. కానీ అమృత యూనివర్సిటీ ఆలోచించడం, నాయకత్వం వహించడం, సేవ చేయడం వంటివి నేర్పుతుంది. విద్య అంటే కేవలం కెరీర్ నిర్మించుకోవడం మాత్రమే కాదు, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించినదని ఈ వర్సిటీ విశ్వసిస్తుంది. కరుణ, విలువలతో సమాజానికి సేవ చేయడమే విద్య అంతిమ లక్ష్యమన్న పూజ్యనీయులైన ‘అమ్మ’ దృక్పథం ఎంతో గొప్పది” అని కొనియాడారు. జ్ఞానం మనకు నైపుణ్యాన్ని, సాంకేతికత శక్తిని ఇస్తే, కరుణ వాటికి ఒక పరమార్థాన్ని ఇస్తుందని, అదే అమృత నేర్పే అత్యున్నత పాఠమని అన్నారు.

**నైపుణ్యంపై దృష్టి సారించండి**

జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలంటే సులువైన మార్గాన్ని కాకుండా, సవాళ్లతో కూడిన కఠినమైన మార్గాన్నే ఎంచుకోవాలని లోకేశ్ యువతకు సూచించారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితాన్ని ఉదాహరణగా చూపుతూ, “మీరు ఎక్కడ మొదలుపెట్టారన్నది ముఖ్యం కాదు, ఎక్కడికి వెళ్లాలని నిర్ణయించుకున్నారన్నదే ముఖ్యం. విజయం కోసం పరుగులు తీయకుండా, అత్యుత్తమ నైపుణ్యం సాధించడంపై దృష్టి పెట్టండి. అప్పుడు విజయం మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తుంది” అని హితవు పలికారు. నిరంతరం నేర్చుకుంటూ, కొత్త విషయాలు తెలుసుకోవాలనే కుతూహలాన్ని కలిగి ఉండాలని కోరారు.

**యువత కలలకు అండగా ఉంటాం**

“భారతదేశం గర్వపడేలా ఏదైనా నిర్మించాలని కలలు కనండి. అది కంపెనీ కావచ్చు, కొత్త టెక్నాలజీ కావచ్చు, లేదా సామాజిక కార్యక్రమం కావచ్చు. మీ కలల సాకారానికి, మీ ప్రయాణానికి మద్దతు ఇవ్వడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వాస్తవ సమస్యలను పరిష్కరించడానికి, ప్రజల జీవితాలను మెరుగుపరచడానికి మీ జ్ఞానాన్ని ఉపయోగించండి” అని లోకేశ్ ఆకాంక్షించారు. 20 ఏళ్ల తర్వాత విద్యార్థులుగా కాకుండా పారిశ్రామికవేత్తలుగా, శాస్త్రవేత్తలుగా, ఆవిష్కర్తలుగా తిరిగి వచ్చి భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# విశాఖ రూపురేఖలు మార్చే మాస్టర్ ప్లాన్.. సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

- మొదటి పేజి తరువాయి

ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం పెట్టుబడులలో భాగంగా ప్రభుత్వం రూ.3.50 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్ల వరకు సమకూర్చాలని, మిగిలిన రూ.5.30 లక్షల కోట్లను ప్రైవేట్ రంగం నుంచి రాబట్టేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని లక్ష్యంగా నిర్దేశించారు.‘బేసిటీ’ ప్రాజెక్టును యాంకర్ ప్రాజెక్టుగా చేసుకుని విశాఖ రీజియన్ అభివృద్ధిని చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సీఎం తెలిపారు. వీఈఆర్ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని, ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని సూక్ష్మ స్థాయి ప్రణాళికతో సమగ్రాభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి ప్రణాళిక మూలపేట పోర్టు నుంచి రాజమండ్రిలోని అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు విస్తరించి ఉండాలని ఆయన సూచించారు. ఏఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పర్యాటకం, హైడ్రోజన్, క్లీన్-టెక్ ఎనర్జీ వంటి కీలక రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. వివిధ ప్రాజెక్టులను పరస్పరం అనుసంధానించడం ద్వారానే విశాఖ ఎకనామిక్ రీజియన్ వేగంగా ప్రగతి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. నిధుల కన్వర్జెన్స్ పద్ధతిని అనుసరించాలని, అవసరమైన చోట వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (ఎ+ఫీ) స్కీంను కూడా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సీఎం విజయ్ తొలి బడ్జెట్‌లో విద్యా రంగానికి పెద్దపీట.. పాఠశాల విద్యకే రూ.44,527 కోట్లు

ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వ తొలి పూర్తి స్థాయి బడ్జెట్‌లో విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యం లభించింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి పాఠశాల విద్య కోసం రూ.44,527 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి ఎన్.మారీ విల్సన్ ప్రకటించారు. 9 నుంచి 12వ తరగతి విద్యార్థుల కోసం ‘పెరుంతలైవర్ కామరాజర్ మోడల్ స్కూల్స్’ పేరుతో ఆధునిక రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యతో పాటు భోజనం, వసతి, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందిస్తారు. ఈ పథకానికి మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.125 కోట్లు కేటాయించారు.ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాల మెరుగుదలకు ‘సూపర్ క్లీన్.. సూపర్ క్యాంపస్’ పథకం కింద రూ.129 కోట్లు కేటాయించారు. తొలి దశలో 10 వేల ప్రభుత్వ పాఠశాలల్లో దీన్ని అమలు చేయనున్నారు.ఉన్నత విద్యనభ్యసించేవాళ్లకు ‘వెట్రి ల్యాప్‌టాప్ పథకం’ కింద ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేసేందుకు రూ.2,000 కోట్లు కేటాయించారు. విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టే అవగాహన కార్యక్రమాలకు రూ.7 కోట్లు కేటాయించారు.సంక్షేమ పథకాలకూ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించే శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం అందించే పథకానికి రూ.560 కోట్లు కేటాయించింది. పెళ్లి రోజు వధువుకు ఎనిమిది గ్రాముల బంగారు నాణెం, పట్టు చీర అందించే పథకానికి రూ.812 కోట్లు ప్రతిపాదించింది.

రాష్ట్ర అప్పులు గత ఐదేళ్లలో రెట్టింపు అయ్యాయని మంత్రి తెలిపారు. అదనంగా రూ.16 వేల కోట్ల ఆదాయం రాబట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## దిగొచ్చిన మెటా.. భారత్‌కు క్షమాపణ చెప్పిన మార్క్ జుకర్‌బర్గ్

ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ భారత ప్రభుత్వానికి క్షమాపణలు తెలిపారు. ప్రధాని మోదీ వీడియో తొలగింపు, తమ ప్లాట్‌ఫామ్‌లపై చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తి చెందడంపై ఆయన చింతిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు, తమ ప్లాట్‌ఫామ్‌ల నిర్వహణలో జరిగిన లోపాలను కూడా అంగీకరిస్తూ ఆయన విచారం వ్యక్తం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు బుధవారం వెల్లడించాయి.ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీకి చెందిన ఓ ఫేస్‌బుక్ పోస్ట్‌ను కొద్దిసేపు తొలగించడంపై పార్లమెంటరీ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ వివాదంపై చర్చించేందుకు మెటా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఢిల్లీలో ఐటీ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా, అభ్యంతరకర, తప్పుడు కంటెంట్ వ్యాప్తిపై భారత ప్రభుత్వం లేవనెత్తిన ఆందోళనలను మెటా ప్రతినిధులు అంగీకరించారని, ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లపై జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. యూజర్లకు ఏ కంటెంట్ చేరాలనేది ప్లాట్‌ఫామ్‌లే ఎంపిక చేసి పంపిణీ చేస్తున్నప్పుడు, వాటిని కేవలం మధ్యవర్తులుగా పరిగణించలేమని భారత అధికారులు మెటాకు స్పష్టం చేసినట్లు సమాచారం.

ఇలాంటి పరిస్థితుల్లో ఐటీ చట్టం కింద లభించే ‘సేఫ్ హార్బర్’ రక్షణ వర్తించదని తేల్చిచెప్పారు. కొన్ని రకాల కంటెంట్‌ను ప్రోత్సహించేందుకు (బూస్టింగ్) భారీగా డబ్బులు చెల్లించినట్లు మెటా అంగీకరించిందని, ఈ తప్పులకు విచారం వ్యక్తం చేసిందని కూడా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రధాని మోదీ పోస్ట్ తొలగింపుపై మూడు రోజుల్లోగా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని పార్లమెంటరీ ప్యానెల్ మెటాను ఆదేశించింది. గడువులోగా స్పందించకపోతే మెటా ‘సేఫ్ హార్బర్’ రక్షణను కోల్పోతుందని ఐటీ మంత్రిత్వ శాఖ వర్గాలు హెచ్చరించాయి. ఈ పరిణామాల మధ్య మెటా ప్రతినిధులు ఐటీ కార్యదర్శితో భేటీ కావడం, కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కూడా సమావేశం కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

## నిరసనల్లో పాల్గొనే యువత పట్ల అత్యంత సహనంతో వ్యవహరించాలి

కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థి ఆందోళనలు, వాటి సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. నిరసనల్లో పాల్గొంటున్న విద్యార్థుల పట్ల అధికారులు అత్యంత విచక్షణతో, సహనంతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. హింసను అదుపు చేసే నెపంతో భద్రతా బలగాలు కూడా అంతే తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగితే పరిస్థితులు మరింత దారి తప్పే ప్రమాదముందని హెచ్చరించింది.దేశ రాజధాని ఢిల్లీతో పాటు బీహార్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లలో సీజేపీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయని, జులై 20 నాటి నిరసనల్లో రాళ్లదాడి, హింస కారణంగా సార్వజనిక ఆస్తులకు జరిగిన నష్టానికి ఆ సంస్థనే బాధ్యులను చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కొత్త అర్జీని కూడా ఢిల్లీ తదితర ప్రాంతాల్లోని విద్యార్థి ఆందోళనలకు సంబంధించిన ప్రధాన కేసులతో సుప్రీంకోర్టు జతచేసింది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుత ప్రదర్శనల సమయంలో పోలీసులు అత్యంత సంయమనం పాటించాలని సూచించిన సీజేఐ... యువత హింసాత్మక మార్గాల వైపు వెళ్లకుండా చూడటమే అధికారుల ప్రాథమిక విధి అని పేర్కొన్నారు. యువకులు అసలు ఏం కోరుకుంటున్నారు, వారి ఆవేదనకు కారణమేంటో ఓపికగా వినడమే అన్ని సమస్యలకు అత్యంత శక్తివంతమైన పరిష్కారమని వ్యాఖ్యానించారు. అయితే శాంతిభద్రతలను కాపాడే క్రమంలో లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల విచక్షణపై తమకు నమ్మకం ఉందని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నివేదికలను పరిశీలించిన పిమ్మటే ఈ విషయంలో తదుపరి నిర్ణయం తీసుకోనున్నట్లు ధర్మాసనం తెలిపింది.

## ఏఐతో భయపడొద్దు.. భారత్‌కు లాభాలే ఎక్కువ

కృత్రిమ మేధ (ఏఐ) వల్ల ఉద్యోగాలు పోతాయన్న ఆందోళనల మధ్య ప్రపంచ బ్యాంకు ఆసక్తికర నివేదిక విడుదల చేసింది. భారత్‌లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఏఐ ఉద్యోగాలను భర్తీ చేయడం కంటే, ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని వెల్లడించింది. సరైన చర్యలు తీసుకుంటే శతాబ్దం పట్టే అభివృద్ధిని పదేళ్లలోనే సాధించే అవకాశం ఉందని పేర్కొంది.ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక ప్రకారం.. అధిక ఆదాయ దేశాల్లో ప్రస్తుతం ఉన్న ఉద్యోగాల్లో 14.2 శాతం ఏఐ ఆటోమేషన్ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉంది. తక్కువ, మధ్యస్థ ఆదాయ దేశాల్లో మాత్రం ఈ ముప్పు 4.5 శాతమే. అదే సమయంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 16.2 శాతం ఉద్యోగాల్లో ఏఐ వల్ల ఉత్పాదకత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ సంఖ్య 18.7 శాతంగా ఉంది.భారీ ఏఐ మోడళ్లు, ఖరీదైన డేటా సెంటర్ల నిర్మాణం కంటే స్థానిక అవసరాలకు అనుగుణంగా తక్కువ ఖర్చుతో పనిచేసే ఏఐ వ్యవస్థలను వినియోగిస్తే భారత్‌కు ఎక్కువ ప్రయోజనం ఉంటుందని ప్రపంచ బ్యాంకు సూచించింది. విద్య, వైద్యం, వ్యవసాయం, న్యాయ సేవలు, ప్రభుత్వ సేవల్లో ఏఐ కీలక మార్పులు తీసుకురాగలదని అభిప్రాయపడింది. ఇప్పటికే భారత్‌తో పాటు కెన్యా, మెక్సికో, నైజీరియా, థాయ్‌లాండ్‌లో ఐదుగురికి పైగా ఉద్యోగులు ఉన్న సంస్థల్లో ఐదింటిలో ఒకటి ఏఐ చాట్‌బాట్‌లను వినియోగిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది.

అయితే విద్యుత్, ఇంటర్నెట్, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, నాణ్యమైన డేటా, బలమైన వ్యవస్థలు లేకపోతే ఏఐ ప్రయోజనాలు పూర్తిగా అందవని ప్రపంచ బ్యాంకు హెచ్చరించింది. దశలవారీగా ఏఐను అమలు చేయాలని, గోప్యతకు రక్షణ కల్పిస్తూ బాధ్యతాయుత వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించింది.

## రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు

- మొదటి పేజి తరువాయి

వచ్చాక ధర రూ.236కు పడిపోయింది. పెట్టుబడి ఖర్చులు పెరుగుతుంటే, గిట్టుబాటు ధర తగ్గిపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు” అని జగన్ అన్నారు. ప్రభుత్వం కేవలం 21 శాతం పంటను మాత్రమే కొనుగోలు చేసిందని, మిగిలిన పంట విషయంలో వ్యాపారులు, సిండికేట్లతో కుమ్మక్కై రైతులను దగా చేస్తోందని విమర్శించారు.గిట్టుబాటు ధర లేకపోవడంతో వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని జగన్ వెల్లడించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రభుత్వ ప్రతినిధులు ఎవరూ వెళ్లకపోవడం దారుణమన్నారు. తమ హయాంలో అమలు చేసిన సున్నా వడ్డీ రుణాల పథకాన్ని, రైతు భరోసా కింద అదనంగా ఇచ్చే సహాయాన్ని రద్దు చేశారని, ఉచిత పంటల బీమాను కూడా ఎత్తివేశారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు.

## విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్...

సాగర నగరం విశాఖపట్నం క్రీడా రంగంలో మరో కీలక ముందడుగు పడింది. భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ఏర్పాటు చేస్తున్న ‘సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్’ నిర్మాణ పనులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం శంకుస్థాపన చేశారు. అరిలోవ సమీపంలోని తోటగరువులో ఈ అకాడమీని నిర్మించనున్నారు.

ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి లోకేశ్‌కు పీవీ సింధు, ఆమె కుటుంబ సభ్యులు, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం, పీవీ సింధు, క్రీడాశాఖ మంత్రితో కలిసి లోకేశ్ శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి, నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు.అనంతరం అకాడమీ భవన నమూనాను, క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురానున్న అత్యాధునిక సౌకర్యాలను మంత్రి లోకేశ్ ఆసక్తిగా పరిశీలించారు. అకాడమీ లక్ష్యాలు, వసతుల గురించి సింధును అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్టుపై రూపొందించిన ప్రత్యేక ఆడియో విజువల్ (ఏవీ) ప్రజెంటేషన్‌ను వీక్షించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, శాప్ ఎండీ భరణి, గ్రీన్ కో ఎనర్జీ డైరెక్టర్ చలమలశెట్టి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## దేవరపల్లిలో జగన్ పర్యటన.. శ్రుతిమించిన శ్రేణుల ఉత్సాహం!

- మొదటి పేజి తరువాయి

గందరగోళానికి దారితీసింది. తమ నాయకుడికి స్వాగతం పలికే క్రమంలో కొందరు కార్యకర్తలు విపరీత ధోరణులతో వ్యవహరించడం స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగించింది. స్థానికంగా ఉన్న ఓ దుకాణాన్ని కూడా ధ్వంసం చేసినట్టు తెలుస్తోంది.వివరాల్లోకి వెళితే, జగన్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ దేవరపల్లిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద ల్యాండ్ అయిన వెంటనే, ఆయన్ను చూసేందుకు కార్యకర్తలు ఒక్కసారిగా దూసుకువచ్చారు. ఈ క్రమంలో అక్కడ ఏర్పాటు చేసిన బారికేడ్లను సైతం లెక్కచేయకుండా తోసుకురావడంతో తోపులాట చోటుచేసుకుంది. దీంతో బారికేడ్లు విరిగిపోయి, స్వల్పంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది.అంతేకాకుండా, దేవరపల్లి ప్రధాన రహదారులపై వైసీపీ కార్యకర్తలు బైక్‌లతో చేసిన హంగామా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. అనేకమంది యువకులు తమ బైక్‌ల సైలెన్సర్లను తొలగించి, భారీ శబ్దాలతో మితిమీరిన వేగంతో వాహనాలు నడిపారు. ప్రధాన కూడళ్ల వద్ద ప్రమాదకరంగా బైక్ విన్యాసాలు చేస్తూ హల్‌చల్ సృష్టించారు. ఈ పరిణామాలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా, స్థానిక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తమ అభిమాన నేతపై ఉన్న ఉత్సాహాన్ని ప్రదర్శించే క్రమంలో కార్యకర్తలు శ్రుతిమించడం విమర్శలకు తావిచ్చింది.

## 20నిమిషాల్లో 7పేలుళ్లు.. దద్దరిల్లిన దుబాయ్

- మొదటి పేజి తరువాయి

పేలుళ్ల కారణంగా పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగలు అలుముకున్నాయి. ఈ పారిశ్రామిక ప్రాంతం పక్కనే ప్రపంచంలోనే అతిపెద్ద నౌకాశ్రయం ఉంది.పేలుళ్ల అనంతరం దుబాయ్‌లోని ఓడరేవుకు ఆనుకుని ఉన్న ఇంధన నిల్వ, రవాణా కోసం ఉపయోగించే ఒక గిడ్డంగిలో మంటలు చెలరేగినట్లు ఉపగ్రహ చిత్రాలు చూపిస్తున్నాయి. ఈ ఘటనలో ప్రాణ, ఆస్తి నష్టాలకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. పేలుళ్ల వెనక హూతీల హస్తం ఉందని ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. యెమెన్ నుంచి ఈ క్షిపణి దాడులు జరిగినట్లు ఇరాక్ ఆరోపించింది. కాగా ఈ పేలుళ్లపై యూఏఈ అధికారిక ప్రకటన చేయలేదు.

## హైడ్రా చీఫ్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ.. 8 ప్రముఖ కాలేజీల అక్రమాల రట్టు!

- మొదటి పేజి తరువాయి

తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

హైడ్రా కార్యాలయం నుంచి ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే, కమిషనర్ పేరు మీద దొంగ సంతకాలతో ఫేక్ ఎన్‌ఓసీలు సృష్టించారు. ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అఫిలియేషన్ (అనుమతులు) సాధించడం కోసం సదరు ప్రైవేటు కాలేజీలు ఈ నకిలీ పత్రాలను సమర్పించాయి. అయితే బోర్డు అధికారులు, హైడ్రా యంత్రాంగం డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించినప్పుడు ఆ సర్టిఫికెట్లు నకిలీవని, వారి సంతకాలు ఫోర్జరీకి గురయ్యాయని తేలింది. ఈ దారుణ అక్రమంపై స్పందించిన హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు.. మోసానికి పాల్పడిన 8 కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ లేక్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు.

**ఫోర్జరీకి పాల్పడిన జూనియర్ కాలేజీలు ఇవే:**

శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, చాంద్రాయణగుట్ట
రెసోనెన్స్ జూనియర్ కాలేజ్, ఎస్ఆర్ నగర్
హైందవి జూనియర్ కాలేజ్, బర్కత్‌పుర
ప్రియాం జూనియర్ కాలేజ్, మెహదీపట్నం
న్యూ ఎరా జూనియర్ కాలేజ్, చిక్కడపల్లి
మదర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజ్, విద్యానగర్
షాహీన్ జూనియర్ కాలేజ్, శివరాంపల్లి
వశిష్ట జూనియర్ కాలేజ్, తెల్లాపూర్.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వాలి

- తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ -- జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్
- తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ ఆగస్టు 5:**పోలవరం జిల్లాలో జన్మించిన ప్రతి శిశువుకు పుట్టిన గంటలోపే తల్లిపాలు అందించాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. తల్లిపాలే శిశువుకు సంపూర్ణ పోషకాహారంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని అందించే అమూల్యమైన ఆహారమని పేర్కొన్నారు.బుధవారం సాయంత్రం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాల సందర్భంగా వాల్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, ఓఎస్డీ జావలి, డీఎఫ్‌వో శివకుమార్ గంగల్, ఆర్డీవో కె. స్వాతి, ఎస్డీపీఓ అష్రఫ్ అలీ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. ఉమాతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బిడ్డకు పాలు ఇచ్చే ముందు తల్లులు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలు ఇవ్వడం అత్యంత ముఖ్యమని తెలిపారు. అలాగే శిశువు పుట్టిన తొలి ఆరు నెలల పాటు తల్లిపాలే ఇవ్వాలని సూచించారు.పోలవరం జిల్లాలోని ఎనిమిది ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, డ్వామా పీడీ రాంప్రసాద్, డీడీఓ వెంకట్ నారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వఅధికారులకు,కృతజ్ఞతలుతెలిపిన టిడిపిపార్టీ,మండలకమిటీనాయకులు



**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.5**
ప్రభుత్వఅధికారులకు,కృతజ్ఞతలుతెలిపిన మండలటిడిపిపార్టీ,మండలకమిటీనాయకులు ఇటీవలగోదావరి వరదల కారణంగా మండలంలోని పలుగ్రామాలువరదనీటిలోమునిగిపోవడంతోమరికొన్ని గ్రామాల్లోవరదలుచుట్టుముట్టబడినసమయంలోప్రభుత్వ అధికారులు,వివిధ శాఖల సిబ్బంది.ప్రాణాలను సైతంలెక్క చేయకుండామండలప్రజలకు అండగా నిలిచారని తెలుగు దేశం పార్టీ మండల కమిటీ,నాయకులు పేర్కొన్నారు. వరదల తీవ్రత అధికంగా ఉన్న రోజుల్లో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్,ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి,ప్రత్యేక అధికారులు,తహసీల్దార్ (ఎంఆర్వో),ఎంపీడీవో,సచి వాలయ సిబ్బంది,పోలీసు శాఖ,విద్యుత్తుశాఖ సిబ్బంది, బోట్ సిబ్బంది.మరియు ఇతర శాఖలకు చెందిన అధి కారులు,ఉద్యోగులు గ్రామాల్లోనే మకాం వేసి సహాయక చర్యలు చేపట్టారని,కొనియాడారు.వరద బాధితులకు ఆహారం,తాగునీరు,వైద్య సేవలు,రవాణా సదుపాయాలు కల్పించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో అధికారులు,సిబ్బం ది విశేష కృషి చేశారని,వినరించారు.మండల ప్రజల ప్రాణాలు,ఆస్తులను కాపాడేందుకు వారు చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు.అదేవిధంగా ప్రభుత్వం అందించిన నిత్యావసరసరుకులు,సహాయ సామగ్రిని గ్రామ గ్రామాన వరద బాధితులకు చేరవేసిన కూటమి నాయకులు,ప్రజాప్రతినిధులు,పార్టీ కార్యకర్తల సేవలను కూడా ఈ సందర్భంగా అభినందించింది.క్లిష్టమైన పరి స్థితుల్లో ప్రజలకు అండగా నిలిచి సహాయక కార్యక్ర మాలను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయడం అభినందనీయమని పేర్కొన్నారు.గోదావరి వరదలసమయంలోప్రజలకోసం అహర్నిశలు శ్రమించిన జిల్లా యంత్రాంగం,వివిధ శాఖల అధికారులు,ఉద్యోగులు, బోట్ సిబ్బంది,కూటమి నాయ కులు మరియు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ వి.ఆర్.పురం మండల ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు టీడీపీ మండల అధ్య క్షుడు బొర్రా నరేష్ కుమార్,జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి మరియు తెలుగుదేశం పార్టీ మండల కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు.

## 40 మంది గర్భిణీలకు సామూహిక సీమంతాలు





**గంగవరం, పెన్ పవర్ ఆగస్టు 5 :** అడ్డతీగల మండలం వెదురు నగరం గ్రామములో శ్రీ శివ సాయి భువనేశ్వరి ఆశ్రమం లో బుధవారం 40 మంది గర్భిణీలకు సామూహిక సీమంతాలు చేయడం జరిగిందని ఆశ్రమ నిర్వాహకులు సాయిరాం తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆషాడ మాసంలో గర్భిణీలకు సీమంతం చేయడానికి నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ఏడుగురు చిన్నారులకు సుహాసిని అమ్మవారిగా భావించి పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాల్గొన్నారని తెలిపారు. వరంగల్ రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఈయన పాల్గొన్నారని అన్నారు. సీమంతం కార్యక్రమం అనంతరం గర్భిణీలకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.

## గోకవరంలో రోడ్డు విస్తరణ కొరకు సర్వే నిర్వహించిన ఆర్డిఓ.





**గోకవరం పెన్ పవర్ ఆగస్టు 05:-** రాజమండ్రి భద్రాచలం వయా గోకవరం మీదుగా ఉన్న ఎన్ హెచ్ 516 ఇ రోడ్డు విస్తరణలో భాగంగా గోకవరం ఠానా సెంటర్లో ఇరుకు వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణం పనులు జరుగుతున్న నేపథ్యంలో రాజమహేంద్రవరం ఆర్డిఓ ఆర్ శివరాముడు బుధవారం రోడ్డు విస్తరణ కావలసిన సర్వే పనులను పరిశీలించారు.ఠానా సెంటర్లోని రోడ్డు మార్గంలో ఇరువైపులా ఎక్కడ నుండి ఎక్కడికి విస్తరణ చేయాల్సిన అవసరం ఉంది ఏవైనా బిల్డింగులు కట్టడాలు ఉన్నాయా అనే విషయంపై క్షేత్రస్థాయిలో క్షుణంగా పరిశీలించి సర్వే నిర్వహించి విస్తరణకు కావలసినంత వరకు మార్కింగ్ చేయడం జరిగింది . ప్రతి ఒక్కరికి ప్రభుత్వం తరఫున నష్టపరిహారం కూడా అందించడం జరుగుతుందని రోడ్డు విస్తరణ వేగంగా జరగడం కోసం ఎవరు ఆటంకాలు కల్పించవద్దని ఆయన అన్నారు. ఈ విస్తరణ సర్వే పరిశీలన నిమిత్తం వచ్చిన ఆర్డిఓ వెంట నిర్మాణ సంస్థ సిబ్బంది ఇంజనీరింగ్ సిబ్బంది గోకవరం తాసిల్దార్ పి రామకృష్ణ రెవెన్యూ ఇన్స్పెక్టర్ వల్లి మండల సర్వేయర్ గ్రామ విఆర్ఓ పలువు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## ఆర్టీసీ అద్దె బస్సు బైకు ఢీకొన్న సంఘటన ఒక వ్యక్తి మృతి.





**గోకవరం పెన్ పవర్ ఆగస్టు 05:-** మండలంలోని గుమ్మల దొడ్డి గ్రామంలో ఎన్ హెచ్ 516 ఇ రోడ్డు పై బుధవారం ఉదయం ఆర్టీసీ అద్దె బస్సు మోటార్ సైకిల్ ఎదురెదురుగా ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి వివరాలు ఈ విధంగా ఉన్నాయి గోకవరం మండలం రంప ఎర్రం పాలెం గ్రామానికి చెందిన కాళ్ల వీర వెంకట సత్యనారాయణ అలియాస్ బుజ్జి (52) అనే వ్యక్తి బుధవారం ఉదయం సుమారు 6:30 7:00 సమయంలో తన స్వగ్రామమైన రంపెర్రంపాలెం గ్రామం నుండి కోరుకొండ వైపు వెళుతుండగా రాజమండ్రి వైపు నుంచి గోకవరం వస్తున్న (సింగల్ స్టాప్ సర్వీస్)ఆర్టీసీ అద్దె బస్సు గుమ్మల దొడ్డి గ్రామంలోనికి వచ్చే సమయానికి మృతుడు బుజ్జి ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న గోకవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని గోకవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్కు పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు చేపట్టారు. కాగా మృతుడు బుజ్జికి మృతి పట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అందరిలో నవ్వుతూ చురుకుగా ప్రతి కార్యక్రమంలో పాల్గొంటున్న బుజ్జి మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

# తల్లిపాలే శిశువుకు తొలి టీకా



- గంగవరంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహణ
- తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించిన సీడీపీఓ వి. సుచరిత ఆదిలక్ష్మి



**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 5:**ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గంగవరం ప్రాజెక్టు పరిధిలోని పి. గార్లపాడు, గంగవరం అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ వి. సుచరిత ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సీడీపీఓ వి. సుచరిత ఆదిలక్ష్మి మాట్లాడుతూ, పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లిపాలు ఇవ్వాలని, ముర్రుపాలు (కొలస్ట్రం) శిశువుకు తొలి టీకా వంటివని తెలిపారు. శిశువుకు తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఈ కాలంలో నీరు, తేనె, పశువుల పాలు లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని సూచించారు.ఉద్యోగానికి వెళ్లే తల్లులు కూడా తల్లిపాలను కొనసాగించవచ్చని, పాలను పరిశుభ్రంగా నిల్వ చేసి కప్పు, చెంచాతో బిడ్డకు అందించాలని వివరించారు. ఆరు నెలల తర్వాత అనుబంధ ఆహారం ప్రారంభించినప్పటికీ రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించడం శిశు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు.చిన్నారులకు చిప్స్, బిస్కెట్లు, చాక్లెట్లు, కేకులు, జ్యూస్‌లు, ఫ్లేవర్డ్ పాలు, శీతల పానీయాలు వంటి అనారోగ్యకర ఆహారాలను అలవాటు చేయరాదని సూచించారు. అలాగే బిడ్డకు సరైన భంగిమలో పాలు పట్టించడం, పాలు తాగిన అనంతరం భుజంపై పెట్టుకుని వీపును మెల్లగా తట్టడం ద్వారా జీర్ణక్రియ మెరుగుపడుతుందని వివరించారు. బిడ్డకు పాలు ఇస్తున్న సమయంలో తల్లులు పూర్తి శ్రద్ధతో ఉండాలని, శిశువు ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు కే. కుమారి, పిచిన సీత, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, ఎం. రాజ్యలక్ష్మి, కే. సోమలమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ హెల్పర్లు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

- చింతూరు డివిజన్‌లో పగడ్బందీగా సహాయక చర్యలు
- అధికారులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అభినందనలు

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ ఆగస్టు 5:**
చింతూరు డివిజన్‌లోని నాలుగు మండలాల వరద ముంపు బాధితులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం పగడ్బందీగా సహాయక చర్యలు చేపట్టిందని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. వరద హెచ్చరికలు జారీ చేసిన వెంటనే బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించి, ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, నిత్యావసర సరుకులు అందించామని పేర్కొన్నారు.బుధవారం ఆయన మాట్లాడుతూ చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఏటపాక మండలాల్లో వరద ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించి, జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నోక్వాల్, చింతూరు ఎస్పీ బి. హేమంత్ ఆధ్వర్యంలో అధికారులను అప్రమత్తం చేసి సహాయక చర్యలను సమన్వయం చేశామని తెలిపారు.వరద సహాయక చర్యల కోసం నాలుగు మండలాల్లో 17 మంది సెక్టార్ అధికారులను నియమించడంతో పాటు కమ్యూనికేషన్ కోసం వైర్లెస్ సెట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిత్యావసర సరుకుల రవాణా, బాధితుల తరలింపునకు 22 బోట్లు, అవసరమైన చోట ట్రాక్టర్లను వినియోగించామని వెల్లడించారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు 1,664.403 మెట్రిక్ టన్నుల బియ్యం అందుబాటులో ఉంచడంతో పాటు తాగునీరు, విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని తెలిపారు. అలాగే నాలుగు మండలాల్లో 65 ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు అందించామని చెప్పారు.
ముంపు ముప్పు ఉన్న ప్రాంతాల నుంచి 2,124 మందిని ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించగా, 15 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం 10,828 కుటుంబాలకు సహాయ సహకారాలు అందించడంతో పాటు 11,801 కిలోల నిత్యావసర సరుకులను పంపిణీ చేశామని వివరించారు.వరదల కారణంగా ఇబ్బందులు ఎదురుకాకుండా 149 మంది గర్భిణులను గుర్తించి సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించి ప్రత్యేక వైద్య సేవలు అందించామని తెలిపారు. పశువులను కూడా ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించి నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.వరద తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో గ్రామాల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యాలు పునరుద్ధరించామని, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వరద బాధితుల సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేసిన వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ఫీల్డ్ సిబ్బంది అందరికీ జిల్లా యంత్రాంగం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.




01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ప్రతి ఇంటికీ సంక్షేమం, ప్రతి వీధికి అభివృద్ధి .. బొడ్డు



**సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు:05**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు పై ప్రజలకు తెలిసేలా ఇంటింటికి టీడీపి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి తెలిపారు. మండలంలోని లంకూరు సీతానగరం గ్రామాల్లో బుధవారం నాడు టీడీపి క్లస్టర్ ఇంచార్జ్ వలవల రాజా ఆధ్వర్యంలో రాజానగరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ముఖ్యఅతిథిగా ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాల పంచుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి ప్రత్యక్ష లబ్ధి చేకూరుతోందని తెలిపారు. మహిళా ఉచిత బస్సు ప్రయాణాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారని ఉచిత గ్యాస్ సిలిండర్లు తల్లికి వందనం, పెన్షన్లు 3000 నుంచి రూ.4,000 కు పెంచటం వంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని పేర్కొన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను, ప్రజల అవసరాలపై నేరుగా వివరాలు తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గెడ్డం తిమ్మరావు, టిడిపి నాయకులు గద్దె వెంకట కృష్ణ చౌదరి (నళిని), ఘంటా రామకృష్ణ, పెందుర్తి అచ్యుత రామారావు, సంగన చిన పోసియ్య, ఆశ్నన బాబు, ఓబులనేని కృష్ణ చైతన్య, చిట్టూరి రంగారావు, గుర్రం ఉదయ్, దుద్దుపూడి శ్రీనివాస్, షేక్ మీరా షరీఫ్ రాజు, సోషల్ మీడియా పుక్కల శ్రీను వాస్, మండా రాంబాబు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అడ్డతీగల మండలంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం..



**అడ్డతీగల ,పెన్ పవర్ ,ఆగస్టు 05:** బుధవారం అడ్డతీగల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జర్తా. వెంకటరమణ రెడ్డి ఆధ్వర్యంలో అడ్డతీగల మండలం డి. భీమవరం, డొక్క పాలెం గ్రామలలో ఇంటి ఇంటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి. భీమవరం గ్రామ కమిటి ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు శీతంశెట్టి. వెంకటేశ్వరరావు , వంతల. రాజేశ్వరి పాల్గున్నారు. రాష్ట్ర లో కూటమి ప్రభుత్వం పాలనలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ ఇంటి ఇంటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సీనియర్ కార్యకర్తలు జుజ్జివరపు. శ్రీనివాస్ చౌదరి, వంక. సతీష్ , అడారి .నాగబాబు, ఎక్స్ ఎంపీపీ అన్నం. సత్తిబాబు , ఎర్రంశెట్టి. రత్నకుమారి.(అరకు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ) కామన. బుజ్జి, బటాని. వరలలక్ష్మీ,సత్తి రెడ్డి, మర్ల .సత్యవతి,చెక్క. వెంకటరమణ ,సదేల. శ్రీనివాస్ రెడ్డి, చెదల. రామకృష్ణ, చెక్క. అప్పారావు, గొల్లపల్లి. చిన్న సత్యనారాయణ, కల్లు శ్రీను, కండేపల్లి. రామకృష్ణ.పోలురాజు శ్రీనివాసరెడ్డి ,చెక్క. వరలక్ష్మీ ,మరియు గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## జనసేనకు ఆత్మీయ గ్రామం రావిపాడు : ఎమ్మెల్యే బొలిశెట్టి







**ల్తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఆగస్టు 05:**జనసేన పార్టీకి రావిపాడు ఆత్మీయ గ్రామమని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. జనసేన పార్టీని అపూర్వంగా ఆదరించిన ఈ గ్రామానికి ప్రత్యేకత ఉందని, జనసేనకు పుట్టినిల్లులాంటి గ్రామమని పేర్కొన్నారు.

ఎన్నికల్లో జనసేన అభ్యర్థి లేకుండానే పార్టీకి మద్దతు తెలిపిన గ్రామమని గుర్తు చేశారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం,పెంటపాడు మండలం,రావిపాడు గ్రామంలో రావిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ములగాల శివకేశవ ఆధ్వర్యంలో బుధవారం వివిధ అభివృద్ధి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం రావిపాడు సొసైటీ ఆవరణలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేశామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవం, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిజాయితీతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు.

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పవన్ కళ్యాణ్ కృషితోకేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు.అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. రావిపాడు గ్రామంలో ప్రతి నెల సంక్షేమ పథకాల కింద రూ.20.73 లక్షల వరకు పెన్షన్లు అందుతున్నాయని వెల్లడించారు. యేసు బాబు కాలనీ అంబేద్కర్ విగ్రహం వద్ద వెంకయ్య కాలువకు రూ.2.70.లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన రేవును ప్రారంభించారు. సర్పంచ్ వీధి, వెంకటేశ్వర స్వామి గుడి వీధులలో సీసీ రోడ్లను ప్రారంభించారు. గ్రామపంచాయతీకి స్వచ్ఛ రధాన్ని అందజేశారు. బెండ్ల పాలెం వద్ద కాలువ దాటడానికి వీలుగా జనసేన ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బహూకరించిన బల్లకట్టు రాకపోకలకు అనువుగా నియమించిన రిటైనింగ్ వాల్, రేవులను పరిశీలించారు. విద్యుత్

లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారంగా గ్రామస్తుల అభ్యర్థన మేరకు విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సబ్ స్టేషన్ పూర్తయితే రావిపాడుతోపాటు మీన వల్లూరు, రామచంద్రపురం తదితర ఎనిమిది గ్రామాలకు లో వోల్టెజ్ సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు.

ఈ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కూటమి నాయకులకు సూచించారు.

జగన్ కులమతాల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో రైతులకు సరైన సహాయం అందలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రైతులను ఎటువంటి సమస్య లేకుండా కాపాడుతుందన్నారు. చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

వైసీపీ నేతలు ప్రజల చేత తిరస్కరించబడిన నాయకులని వ్యాఖ్యానించారు.

వైసిపి నేతలకు డబ్బు దోచుకోవడం అలవాటైందని ఆరోపించారు. ప్రజల్లో లేని సమస్యలను సృష్టించి రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. అవినీతి లేని స్వచ్ఛమైన పాలన పాలనను అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు అన్నగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## గుమ్మల దొడ్డి గ్రామంలో పారిశుధ్యం పై సమీక్ష నిర్వహించిన డి డి ఓ వీణాదేవి





**గోకవరం పెన్ పవర్ ఆగష్టు 05:-** జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలుమేరకు గోకవరం మండలం గుమ్మల దొడ్డిలో పారిశుధ్యం పై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం డివిజన్ డెవలప్మెంట్ అధికారి వీణా దేవి హాజరై గ్రామ పరిస్థితిపై పలుసూచనలు చేశారు,గోకవరం ఎంపీడీఓ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి ఎం గోవిందు ఆధ్వర్యంలో గ్రామ ప్రజలతో శానిటేష్ మరియు ఇతర ప్రజా సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విఓఏ లు , ఐసిడిఎస్ సిబ్బంది,ఏఎన్ ఎమ్,ఎంపీటీసీ కోట సత్యవతి, మాజీ ఎంపీపీ రత్న జ్యోతి అశోక్,తాజా మాజీ వార్డ్ నెంబర్ అబ్బిరెడ్డి రాంబద్రం, కోట చిన్న సూరిబాబు,రాజకీయ నాయకులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నా సమావేశంలో గ్రామ పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా,విద్యుత్ సంబంధిత సమస్యలు,వీధి దీపాలు, డ్రైనేజీ మరియు ఇతర ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించారు. గ్రామస్తులు ఈ సందర్భంగా పలు సమస్యలను డిడిఓ దృష్టికి తీసుకువచ్చారు వాటి సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని డి డి ఓ ఆదేశించారు.

చెరువు పక్కన ఉన్న డంపింగ్ యార్డ్ తొలగించి ఎదురుగా ఉన్న స్థలంలో డంపింగ్ యార్డ్ వేయలని.

ఎస్ సి,బి సి ఏరియా సెంటర్ పాయింట్ లో ఉన్న ఇటీవల నిర్మించిన జల్ మిషన్ ద్వారా నిర్మించిన ట్యాంకు నుండి ఇంటికి నీటి సరఫరా చేయుటకు విద్యుత్ సమస్య ఉందని తక్షణం ట్రాన్స్కో సిబ్బందితో మాట్లాడి చర్యలు చేపట్టాలని ఎండిఓ ఆదేశించారు.

డ్రైన్ లో ఉన్న సింట్ (పూడికలు),కొత్తగా ఎస్సీ పేట నుండి మెయిన్ రోడ్ కి కొత్త ఎలక్ట్రికల్ లైన్లు ఏర్పాటు, తదితర సమస్యలు గ్రామస్తులు డిడిఓ దృష్టికి తీసుకురాగా స్పందించిన డిడిఓ వీణా దేవి సదరు పైన తెలిపిన సమస్యలు వారం పది రోజుల్లో క్లియర్ చేసి రిపోర్టు సంబంధిత ఫొటోస్ తో నివేదిక పంపవలసిందిగా ఎంపీడీఓని రాజమహేంద్రవరం డివిజన్ డెవలప్మెంట్ అధికారి ఆదేశిం చారు.

## నాణ్యతలో రాజీ వద్దు పది కాలాలు మన పేరు ఉండాలి.

సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ ఉంగరాల రాము.





**గోకవరం పెన్ పవర్ ఆగష్టు 05:--** ఏ పని చేసినా నాణ్యతతో ఉండాలని పని చేసిన వారు ఎవరని పదికాలాలు చెప్పుకునేలా ఉండాలని తెలుగుదేశం పార్టీ నాయకుడు సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ ఉంగరాల రాము అన్నారు. మండలంలోని రంప ఎర్రంపాలెం గ్రామంలో మండల పరిషత్ స్పెషల్ ఎలిమెంటరీ పాఠశాలలో నాడు నేడు పనులు అసంపూర్తిగా ఉండడంతో స్థానిక శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ దృష్టికి తీసుకువెళగా మిగిలి పనులు పూర్తిచేయాలని ఆదేశించారని దీనిలో భాగంగానే మండల పరిషత్ ఎలిమెంటరీ పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపడుతున్నామని ఈ నిర్మాణంలో ఎ నాణ్యత మరియు బాధ్యతగా నిర్మించాలని ఆయన అన్నారు. బుధవారం ఆయన పాఠశాలను ఎంపీడీవో ఎం గోవిందు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సత్యం పెద్దబ్బులు (వెంకటేశ్వరరావు) నారా ప్రసాద్, బత్తిన రామకృష్ణ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాంపౌండ్ వాల్ కు ఉపయోగిస్తున్న మెటీరియల్ నాణ్యతను స్వయం గా పరిశీలించి పలు సూచనలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ ఉపాధ్యాయుల సుబ్రహ్మణ్యం పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మల్లవరపు వెంకటరమణ పలువురు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు వీరి వెంట ఉన్నారు.

# తల్లి పాలే శిశువుకు అమృతం

- మొదటి ఆరు నెలలు తల్లిపాలే ఇవ్వాలి
- ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. ఉమా



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ఆగస్టు 5:**తల్లి పాల వారోత్సవాల సందర్భంగా రంపచోడవరంలోని వన్ స్టాప్ సెంటర్ (ఓఎస్సీ) బర్త్ వెయిటింగ్ హాల్‌లో గర్భిణీ స్త్రీలు, బాలింతల కోసం బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లి, శిశు ఆరోగ్య సంరక్షణ, తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహారంపై ఈ కార్యక్రమంలో విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. ఉమా మాట్లాడుతూ, “తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అమృతం. పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు అందించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల శిశువు సంపూర్ణ పోషకాహారాన్ని పొందడంతో పాటు ఆరోగ్యంగా ఎదుగుతాడు. గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ సమతుల్య పోషకాహారం తీసుకోవాలి. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి శిశువుకు తల్లిపాలను అందించడం తమ బాధ్యతగా భావించాలి,” అని అన్నారు.అనంతరం గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన సమతుల్య పోషకాహారం, బాలింతల ఆరోగ్య పరిరక్షణ, నవజాత శిశువుకు తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై వివరించారు.ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గాదెలపాలెం లో ప్రభుత్వ పథకాలపై ప్రచారంలో దూసుకుపోతున్న గల్లా రాము.



**గోకవరం పెన్ పవర్ ఆగస్టు 05:--** కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాలను సమపాలలో ముందుకు తీసుకు వెళుతూ అభివృద్ధి పథంలో నడిపించడం జరుగుతుందని తెలుగు యువత జగ్గంపేట నియోజకవర్గ ఉపాధ్యక్షుడు స్కూల్ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గల్లా రాము అన్నారు. గోకవరం మండలం గాదెలపాలెం లో బుధవారం కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాలపై విస్తృత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్ర మాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజలకు పథకాల వివరాలను వివరించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం మహిళలు రైతులు యువతవృద్ధులు పేద కుటుంబాల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని అనేక ప్రజాహిత పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ చర్యలు చేపడుతున్నారని ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆయన అన్నారు.

## సైబర్ నేరాలపై కళాశాల విద్యార్థులకు అవగాహన



**సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు: 05:**సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీతానగరం ఎస్సై ఎల్. శ్రీను నాయక్ అన్నారు. బుధవారం నాడు మండలంలోని సత్య ప్రభ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ బాగా పెరిగింది టెక్నాలజీ మంచి గురించి అందిపుచ్చుకోవాలన్నారు. మనిషి మనుగడా టెక్నాలజీ తో ముడిపడి ఉందని మరియు అదే సమయంలో సైబర్ నేరాల పై అప్రమత్తంగా ఉండాలని గుర్తు తెలియని వ్యక్తులు పంపించే మెసేజ్ లకు రెస్పాండ్ కావద్దని మరియు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి డబ్బులు పోగొట్టుకుంటున్నారని జాబ్స్ ఉన్నాయి ఆఫర్లు ఉన్నాయి గిఫ్ట్ వస్తాయని ఎన్నో రకాలుగా మోసం చేస్తున్నారని వాటన్నిటిని దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. అన్నిటిపై అప్రమత్తంగా ఉండాలని గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే రెస్పాండ్ కావద్దని మన యొక్క బ్యాంకు డీటెయిల్స్ ఓటీపీ నెంబర్లు ఎవరికీ చెప్పవద్దని సూచించారు ఈ కార్యక్రమంలో సత్య ప్రభ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యవర్తిత్వంతో కోర్టు కేసులను పరిష్కరించు కోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునేద్ అహ్మద్ మౌలానా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 5:**సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులకు సంబంధించి ఇరుపక్షాలు, న్యాయవాదులు మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించు కోవడానికి ముందుకు రావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునేద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు.

బుధవారం జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో “మిడియేషన్ 3.0” ప్రచార కార్యక్రమంలో భాగంగా ర్యాలీ వన్ కే వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యాలయం వద్ద జరిగిన ప్రారంభోత్సవంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ డీఎల్ఎస్ఏ కార్యాలయం నుండి బయలుదేరి పుష్కర్ ఘాట్ మీదుగా తిరిగి డీఎల్ఎస్ఏ కార్యాల యానికి చేరుకుంది.

ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునేద్ అహ్మద్ మౌలానా మాట్లాడుతూ, కోర్టుల్లో కేసుల పెండెన్సీని తగ్గించడానికి, వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడానికి మధ్యవర్తిత్వ ప్రక్రియపై ప్రజలకు, న్యాయవాదులకు అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. గత కొంతకాలంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న మధ్యవర్తిత్వ ప్రచార కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు.మధ్యవర్తిత్వం తో పరిష్కారమైన కేసులపై మళ్లీ పైకోర్టుకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉండదని, దీంతో వివాదం శాశ్వతంగా పరిష్కారమ వుతుందని వివరించారు. సివిల్ కోర్టుల్లో రాజీ కుదిరిన కేసుల్లో కోర్టు ఫీజు తిరిగి పొందే అవకాశం ఉంటుందని చెప్పారు.

గతంలో ఇరుపక్షాలు రాజీకి వచ్చినప్పుడు కేసులను లోక్ అదాలత్‌కు పంపేవారని, ప్రస్తుతం కక్షిదారులు న్యాయవాదులు స్వచ్ఛం దంగా ముందుకు వచ్చి తమ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడానికి ఆసక్తి చూపడం ఎంతో శుభపరిణామమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అభినందించారు.

ఈ మధ్యవర్తిత్వ ప్రక్రియను ప్రజలు న్యాయవాదులు సద్వినియోగం చేసుకొని తమ కేసులను సులభంగా, వేగంగా, సామర స్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో మొదటి అదనపు సివిల్ జడ్జి కె. రత్న ప్రసాద్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి వై. శ్రీలక్ష్మి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్.వి. ప్రసాద్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాదులు, శిక్షణ పొందిన మీడియే టర్లు, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన

### లెనోరా ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా ఉపాధి, నైపుణ్య శాఖల శిక్షణ కార్యక్రమం



**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ ఆగస్టు 5:**రంపచోడవరంలోని లెనోరా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు పోటీ పరీక్షలు, ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉపాధి అధికారి పి. నిరుపమ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం. పెరుమాళ్లరావు పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి అధికారి పి. నిరుపమ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగాలు, బ్యాంకింగ్, రైల్వే, ఎస్ఎస్సీ, గ్రూప్స్, పోలీస్ నియామకాలు తదితర పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే లక్ష్యంతో కూడిన ప్రణాళిక, సమయపాలన, నిరంతర సాధన ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న కెరీర్ గైడెన్స్, ఉద్యోగ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వ్యక్తిత్వ వికాసం, కెరీర్ ప్లానింగ్, ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యే విధానం, ప్రస్తుత, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకునే అంశాలను విద్యార్థులకు వివరించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం. పెరుమాళ్లరావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్హతలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, డిజిటల్ నైపుణ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానం, ఆంగ్ల భాషా ప్రావీణ్యం, ఇంటర్వ్యూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాలు, జాబ్ మేళాలను వినియోగించుకుని మెరుగైన ఉపాధి అవకాశాలు పొందాలని పిలుపునిచ్చారు.

కళాశాల ఉప ప్రధానోపాధ్యాయుడు పి. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే క్రమశిక్షణతో సిద్ధమవ్వాలని, ప్రభుత్వ శాఖలు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం

### హ్యూమన్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఏపీ, తెలంగాణ చైర్‌పర్సన్ ఖండవల్లి లక్ష్మి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్,ఆగస్టు 5:** బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హ్యూమన్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆంధ్రా--తెలంగాణ రాష్ట్ర చైర్‌పర్సన్ ఖండవల్లి లక్ష్మి స్పష్టం చేశారు. దివాన్‌చెరువుకు చెందిన కోమలి లక్ష్మి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆమె స్థానిక ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ, బాధితుల తరుపున జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయించడంతో పాటు కోర్టును కూడా ఆశ్రయించి చట్టబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని వెల్లడించారు.

దివాన్‌చెరువుకు చెందిన కోమలి లక్ష్మి మాట్లాడుతూ, వైసీపీ నాయకుడు యర్రంశెట్టి నాగు తన వద్ద రెండు సంవత్సరాల క్రితం వడ్డీ ఇస్తానని చెప్పి రూ.10 లక్షలు అప్పు గా తీసుకుని వడ్డీతో పాటు అసలు సొమ్ము కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. చాలాసార్లు అడిగినప్పటికీ నాగు స్పందించడం లేదని , పైగా అసభ్యకరంగా మాట్లాడుతున్నారన్నారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆమె వాపోయారు. తనకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

ఈ ఘటనపై స్పందించిన ఖండవల్లి లక్ష్మి, అమాయక ప్రజలను మోసం చేయడం, తిరిగి వారిపైనే వేధింపులకు గురిచేయడం ఏ పార్టీ నాయకుడికి సమర్థనీయం కాదన్నారు. సమాజంలో మానవత్వం, నిజాయితీ, బాధ్యతతో వ్యవహరించ డం రాజకీయ నాయకుల కర్తవ్యమని గుర్తుంచు కోవాలన్నారు. బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని, వారి ఆవేదనను ప్రజా ప్రతినిధులు, అధికారులు అర్థం చేసుకోవాలన్నారు.

ఈ మోసం వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అవసరమైతే జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. న్యాయం కోసం కోర్టును కూడా ఆశ్రయిస్తామని, చట్టబద్ధంగా అన్ని మార్గాల్లో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

బాధిత కుటుంబానికి హ్యూమన్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అన్ని విధాలా అండగా ఉంటుందని, న్యాయ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సమాజంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ సంస్థ అండగా నిలుస్తుందన్నారు.

హ్యూమన్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఉపాధ్యక్షులు కృష్ణ కుమారి పాల్గొన్నారు.

## చంటి బిడ్డలకు తల్లి వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం..




**అడ్డతీగల, పెన్ పవర్,ఆగస్టు05:**అడ్డతీగల ఐసీడీఎస్ సిడిపివో క్రాంతికుమారి ఆధ్వర్యంలో అడ్డతీగల మండలం ధాన్యం పాలెం అంగన్వాడి సెంటర్ లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ క్రాంతి కుమారి మాట్లాడుతూ ?బిడ్డ పుట్టిన గంట లోపే అందించే తొలి పాలు (ముర్రు పాలు) బిడ్డకు మొదటి టీకా లాగా పని చేస్తోంది అని అన్నారు. తల్లి తొలి పాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి అని, శిశువు పుట్టినప్పటి నుండి ఆరు నెలల వయస్సు వరకు నీరు కూడా ఇవ్వకుండా కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలి అని , తల్లిపాల వల్ల పిల్లల్లో ఇన్ఫెక్షన్లు, నిమోనియా, విరేచనాలు వంటి వ్యాధులు రాకుండా రక్షణ కవచముల పనిచేస్తుందని, పౌడర్ పాలు, సీసా పాలు ఇవ్వడం వల్ల పిల్లల ఆరోగ్యానికి ప్రమాదమని, కేవలం తల్లిపాలు మాత్రమే శ్రేయస్కరమని తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు స్వర్ణ లత, అరుణలత, బిడ్డ తల్లులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## మోసంతో ఆస్తి కాజేసిన సర్పంచ్, ఆడపడుచులపై చర్యలు తీసుకోవాలి

### న్యాయం కోరుతూ పిల్లలతో తో కలిసి బాధితరాలు బిక్షాటన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 5:** నేటి సమాజంలో డబ్బే ప్రధానమని , బంధుత్వాలు, మానవత్వాలు అక్కర్లేదనే ఉదంతం మరోసారి వెలుగులోకి వచ్చింది. ఒక గ్రామానికి మహిళ సర్పంచ్ గా (ప్రజాప్రతినిధి ) ప్రజలకు ఆదర్శవంతంగా ఉండాల్సిన మహిళ తన భర్త, కొడుకులు, అతని అనుచరులతో కలిసి బంధువు అయిన మహిళను, ఆమె మైనర్ పిల్లలపై బౌతిక దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేసిన సంఘటన ఇది. ఇందుకు సంబంధించిన వివరాలను బాధితురాలు ఏడద ప్రియదర్శిని, తన పిల్లలు, తల్లితో కలిసి బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశంలో తెలిపారు. కరోనా సమయంలో తన భర్త ఏడిద దొరబాబు చనిపోయిన వెంటనే తన ఆడపడుచు, మాజీ సర్పంచి, భర్త , ఆమె కొడుకులు, ఆమె సోదరి అనుచరులు తన పైన, తన పిల్లల పైన భౌతిక దాడులకు, వేధింపులకు పాల్పడ్డరని కన్నీటి పర్యాంతమయ్యారు. కోరుకొండ కు చెందిన తనతో సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామానికి చెందిన సర్పంచి చంద్రలీల సోదరుడు ఏడిద దొరబాబుతో 2006లో తనకు వివాహమైంద న్నారు. తన మామ ఏడిద అబ్బులు విశాఖపట్నం ఎయిర్పోర్ట్ లో ఉద్యోగం చేస్తూ 2019లో రిటైర్ అయ్యారన్నారు. ఆయనకు గ్రామంలో 87 సెంట్ల స్థలం, నాలుగున్నర సెంట్లలో నిర్మించిన ఇల్లు, ఐదు సెంట్ల ఇంటి స్థలం కలిగి ఉన్నారన్నారు. సర్పంచి పదవిని అడ్డం పెట్టుకొని తమ మామ ఆస్తులకు నకిలీ పత్రాలు సృష్టించి రహస్యంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. తమ కుటుంబానికి నిలువ నీడ లేకుండా చేశారని వాపోయారు.

తనకు జరిగిన అన్యాయంపై బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా జిల్లా కలెక్టరు, జిల్లా ఎస్పీల దృష్టికి తీసుకువెళ్లిన న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేసారు. గ్రామ పెద్దల సమక్షంలో తమకు 70 సెంట్లు భూమిని రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేస్తామని నిందితులు హామీ ఇచ్చారన్నారు. అయితే ఆ భూమిపై సొసైటీలో రూ 5,20 లక్షల అప్పు ఉందని అది చెల్లించి పత్రాలు విడిపించుకోవాలని ఆడపడుచులు చెప్పారన్నారు. తాను తన సోదరుల సహకారంతో తాను వడ్డీలకు అప్పు చేసి అప్పు తీర్చిన తరువాత పత్రాలు తనకు ఇవ్వకుండా మోసం వారు చేశారన్నారు. ఆనాటి నుంచి ఆర్థికంగా కుటుంబ పోషణకు ఎన్నో అష్ట కష్టాలు పడుతు న్నామని పిల్లలకు ఫీజులు కట్టలేక చదివించు కోలేక పోతున్నామన్నారు. ఇటీవల ఆడ పడుచులు , భర్త వారి కుమారులు తనను, తన కూతుర్ని లైంగికంగా వేధిస్తున్నారని, తమపై భౌతిక దాడి చేసి హత్యాయత్నం చేశారని, దీనిపై సీతానగరం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశానని తెలిపారు. తనకు న్యాయం జరిపించాలని కోరుతూ గడపగడపకు వెళ్లి భిక్షాటన చేస్తానని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు పాస్టర్ కోడె మోజేస్ బాబు మాట్లా డుతూ, మహిళా సర్పంచ్ అయి ఉండి తోటి మహిళా పైన, సొంత బంధువులనే మానవత్వం లేకుండా అక్రమంగా ఆస్తిని స్వాహా చేసి, సొంత ఇంటి నుంచి గెంటి వేయడం, భౌతిక దాడులకు, హత్య యత్నం చేయడం దారుణమన్నారు. నిందితులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, బాధితురాలి కి రక్షణ కల్పించాలని, న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఈనెల 7న విడుదల అయ్యే కె జె క్యూ చిత్రాన్ని ఆదరించండి



చిత్రం ప్రమోషన్ లో భాగంగా హీరోలు, హీరోయిన్ విజ్ఞప్తి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్ ఆగస్టు 5:**గ్యాంగ్ స్టర్ జీవితంలో కుటుంబ పరంగా ఎదురయ్యే సంబంధ బాంధవ్యాలతో తెరకెక్కించిన కేజే క్యూ చిత్రాన్ని ఆదరించాలని చిత్రం హీరోలు శశి, శక్తి , హీరోయిన్ యుక్తి లు విజ్ఞప్తి చేశారు. చిత్రం ప్రమోషన్ లో భాగంగా బుధవారం నగరానికి విచ్చేసిన వారు స్థానిక హోటల్ లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. హీరో శశి మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన చిత్రం విడుదల వుతుందని థియేటర్లో చూసి ఆదరించాలని కోరారు. ఈ చిత్రాన్ని 90 శాతం వరకు డైరెక్టర్ కిరణ్ పూర్తి చేశారని అకస్మాత్తుగా మృతి చెందడం దురదృష్ట కరమన్నారు. ఆ తర్వాత ఈ చిత్రాన్ని కిరణ్ భావజాలంతోనే శ్రీకాంత్ దర్శకత్వం వహించా రన్నారు. గత చిత్రాల కన్నా ఈ చిత్రం భిన్నంగా ఉంటుందని ప్రేమతో పాటు గ్యాంగ్ స్టర్ల జీవితాలను దగ్గరగా చిత్రీకరించామని, పాత హైదరాబాదు గుర్తుకు వస్తుందన్నారు.

# ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని వైవిధ్యభరితంగా నిర్వహించాలి






- గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రత్యేక కార్యక్రమాలు
- ఏర్పాట్లపై అధికారులతో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సమీక్ష

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ ఆగస్టు 5:**ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని రంపచోడవరం ప్రాంతంలో గిరిజన సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వైవిధ్యభరితంగా నిర్వహించాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రతి కార్యక్రమంలో గిరిజనుల భాగస్వామ్యం ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. బుధవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రంపచోడవరం గిరిజన సంస్కృతికి కేంద్రబిందువుగా నిలిచిందని, వేడుకలను కేవలం అధికారిక కార్యక్రమాలకే పరిమితం చేయకుండా గిరిజన జీవన విధానం, ఆచారాలు, సంప్రదాయాలు ప్రతిఫలించేలా ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించాలని పేర్కొన్నారు.

**రంప విప్లవం -- అల్లూరి స్ఫూర్తి ప్రత్యేక ఆకర్షణలు**

రంప విప్లవ చరిత్రను ప్రతిబింబించే ప్రదర్శనలు, అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిని చాటిచెప్పే సాంస్కృతిక రూపకాలు, కొమ్ము డాన్స్, గిరిజన సంప్రదాయ నృత్యాలు, జానపద కళారూపాలు, యువత పాల్గొనే సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణలుగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

**గిరిజన వంటకాల ప్రదర్శనకు ప్రాధాన్యం**

స్థానిక గిరిజన మహిళా సంఘాల భాగస్వామ్యంతో సంప్రదాయ గిరిజన వంటకాల ప్రదర్శన, ఫుడ్ స్టాల్స్, రుచి కార్యక్రమాలు నిర్వహించి ఈ ప్రాంత ప్రత్యేక ఆహార సంస్కృతిని ప్రజలకు పరిచయం చేయాలని ఆదేశించారు. అలాగే ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ థీమ్‌లతో కార్యక్రమాలు నిర్వహించి ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు.

**క్రీడలు, మౌలిక సదుపాయాలు పటిష్టంగా**

అధికారులు, విద్యార్థులు, యువత కోసం ప్రత్యేక క్రీడా పోటీలు నిర్వహించడంతో పాటు గిరిజన సంప్రదాయ క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో శుభ్రత, భద్రత, తాగునీరు, వైద్య సేవలు తదితర మౌలిక సదుపాయాలను పటిష్టంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, ఓఎస్డీ జావలి, డీఎఫ్‌వో శివకుమార్ గంగల్, ఆర్డీవో కె. స్వాతి, డీఆర్వో పి. అంబేద్కర్, ఎస్డీపీఓ అష్రఫ్ అలీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇంజినీర్లు, ఐటీడీఏ, ఐసీడీఎస్, డీఆర్డీఏ, వైద్య, వ్యవసాయ, ఉద్యాన, విద్య, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 16వ డివిజన్ లో రెండేళ్ల నమ్మకం అభివృద్ధి- సంక్షేమం లో ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 5:** వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. బుధవారం "రెండేళ్ల నమ్మకం అభివృద్ధి-సంక్షేమం" డోర్ కార్యక్రమంలో భాగంగా 16వ డివిజన్ వీరభద్ర నగర్, శాంతిపురం ప్రాంతాల్లో ఎమ్మెల్యే గోరంట్ల పర్యటించి రెండేళ్ల సంక్షేమ విజయాలను ప్రజలకు వివరిస్తూ ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో శిధిలావస్థకు చేరిన అనేక ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ఈ కాలనీ నందు ఇల్లు కేటాయించింది తనేనని, 2014-19 కాలంలో చాలామందికి హౌసింగ్ లోన్లు ఏర్పాటు చేసి నూతన గృహాలు నిర్మించేందుకు కృషి చేశానన్నారు . హౌసింగ్ శాఖ అధికారులను పంపించి సమగ్ర సర్వే చేయించి, అర్హులందరికీ పక్కా ఇల్లు నిర్మించేందుకు హౌసింగ్ లోన్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. రాబోయే పుష్కరాల నాటికి వీరభద్ర నగర్ నుండి ఈస్ట్ రైల్వే స్టేషన్ మీదుగా బాలాజీ పేట, బొమ్మూరు వరకు ప్రధాన రహదారి అవుతుందని, రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. వార్డు లో మురుగునీటి సమస్య పరిష్కరించేందుకు కోట్లాది రూపాయలతో పెద్ద కల్వర్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని గోరంట్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవి రామ్ కిరణ్, టూరిజం చలమూరి సత్యనారాయణ, ఏడాకుల వెంకటేశ్వరరావు, సింగవరపు సత్యనారాయణ, ఎం.ఎం.ఎల్ రాజు, శీలం గోవిందు, రొంపిచర్ల యాంటోని, సంగారెడ్డి సుబ్బాయమ్మ, కుంచే కుమారి, కాటూరి ప్రభాకర్, కోరుమిల్లి శేఖర్, బొంగ శాంసంగ్, చెక్క శీను, ఎర్రిపల్లి మురళి, తానారా త్రినాధ్, ఎలక సురేష్ తదితరులు పాల్గొన్నారు

# అతివేగం బలితీసింది.

- చిడుమూరు వద్ద రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి
- భార్యకు తీవ్ర గాయాలు. భద్రాచలం ఆస్పత్రికి తరలింపు






**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 5:** చిడుమూరు అవుట్‌కట్స్ సమీపంలో బుధవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, ఆయన భార్య తీవ్రంగా గాయపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. భద్రాచలం నుంచి జగదల్పూర్ వైపు వెళ్తున్న హోండా గ్రాండ్ ఐటెన్ కారు అతివేగంతో ప్రయాణిస్తూ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఎంవీ 79 ప్రాంత నివాసులు, భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, ద్విచక్ర వాహనం నడుపుతున్న ఆమల్ విశ్వాస్ (40) తీవ్ర గాయాలకు గురై చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయన భార్య చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చింతూరు ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ రహదారులపై అతివేగంతో వాహనాలు నడపడం వల్లనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనదారులు నిర్దేశిత వేగ పరిమితులను పాటిస్తూ అప్రమత్తంగా వాహనాలు నడపాలని పోలీసులు సూచించారు.




## తొలి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

# ఘనంగా నిర్వహించాలి

**దేశభక్తి ఉట్టిపడేలా పరేడ్, గార్డ్ ఆఫ్ ఆనర్, టేబ్లోలు, సాంస్కృతిక కార్యక్రమాలు**

**ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్**

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ ఆగస్టు 5:**జిల్లా ఏర్పాటు అనంతరం తొలిసారిగా నిర్వహించనున్న ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా, దేశభక్తి భావాలను ప్రతిబింబించేలా నిర్వహించాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో జరిగే ప్రధాన వేడుకలను రాష్ట్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమానికి తగిన స్థాయిలో నిర్వహించాలని సూచించారు. బుధవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో వేడుకల ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించిన కలెక్టర్, కార్యక్రమాల నిర్వహణకు జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్‌ను ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలిపారు. రెవెన్యూ డివిజనల్ అధికారి అన్ని శాఖలతో సమన్వయం చేసి ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గార్డ్ ఆఫ్ ఆనర్, పరేడ్, పోలీస్ బ్యాండ్, డాగ్ స్క్వాడ్ ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండు ప్లాటూన్లలో 48 మంది పోలీసులు, హోం గార్డులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరేడ్ పరిశీలన కోసం ఓపెన్ టాప్ జీప్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లు, గురుకుల విద్యాసంస్థల విద్యార్థుల భాగస్వామ్యంతో గిరిజన సంస్కృతి, దేశభక్తిని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఫైర్ డెమో, విపత్తు నిర్వహణ బృందాల విన్యాసాలను ప్రత్యేక ఆకర్షణలుగా ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్న స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాలు, ప్రముఖులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపాలని, మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక ఎన్‌క్లోజర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవార్డుల ఎంపికలో ఐవీఆర్ఎస్ ద్వారా వచ్చిన అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, అధికారుల ప్రసంగాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తాడేపల్లిగూడెం స్పిరిట్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవ కార్యక్రమలు






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 05.**తాడేపల్లిగూడెం స్పిరిట్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ లయన్ అడ్డు రంజిత్ అధ్యక్షత న పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ గట్టిం మాణిక్యాల రావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.

కార్యక్రమలు

1.లయన్ పట్నాల సత్య శ్రీనివాస్ గారి దాతృత్వంతో 7వ వార్డు హుస్సేన్ జంక్షన్ మున్సిపల్ మోడల్ స్కూల్ 55 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్సిల్స్,షాప్నర్స్, ఏరాజర్స్ ఇవ్వడం జరిగింది.

2.లయన్. ఫణి కుమార్ దాతృత్వంతో 6 వార్డు గుడ్ షేపర్డ్ ఎయిడెడ్ స్కూల్ నందు 15 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్సిల్స్, స్కేల్, ఏరాజర్స్,షాప్నర్స్ ఇవ్వడం జరిగింది.

3.పాస్ట్ గవర్నర్ లయన్ గట్టిం మాణిక్యాల రావు దాతృత్వంతో 7 వార్డు హుస్సేన్ జంక్షన్ మున్సిపల్ మోడల్ స్కూల్ విద్యార్థులకు 25 చొప్పుల జతలు ఇవ్వడం జరిగింది.

4.డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇచ్చిన గొడుగు తాలూకా ఆఫీస్ సెంటర్లో గల గోవిందు అనే చిరు వీధి వ్యాపారస్తుడి కి ఇవ్వటం జరిగింది.

ఈకార్యక్రమంలో సెక్రటరీ లయన్ నూకల మహేష్, కోశాధికారి ఆలపాటి కృష్ణ కుమార్,డైరెక్టర్ టి. పాండు రంగా రావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీల్లో 24 కిలోల గంజాయి పట్టివేత



**ఇద్దరు నిందితుల అరెస్ట్**

**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 5:**మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో పోలీసులు రూ.12 లక్షల విలువైన 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఒడిశా రాష్ట్రంలోని పసుపులంక ప్రాంతం నుంచి గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో మోతుగూడెం ఎస్ఐ అబ్దుల్ నాసిర్ హుస్సేన్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, వారి వద్ద నుంచి 24 కిలోగ్రాముల గంజాయి లభ్యమైంది. అరెస్టు చేసిన నిందితులు గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన పిల్లి లీల కృష్ణ, ఆవులూరి విజయ్ కుమార్గా పోలీసులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందని వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో ఏఎస్ఐ టి. రాజేశ్వరరావుతో పాటు మోతుగూడెం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి, తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు.

# ఆపరేషన్ ఈగల్ ఆధ్వర్యంలో చింతూరులో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమం






**మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు ఈగల్ బృందం అవగాహన**

**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 5:**మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు చింతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐజీపీ ఆకే రవి కృష్ణ, ఈగల్ విభాగం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈగల్ పల్లెబాట కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఈగల్ సెల్, టాస్క్ ఫోర్స్ తూర్పు గోదావరి జిల్లా ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆపరేషన్ చైతన్యం, ఆపరేషన్ గరుడ, ఆపరేషన్ ఈగల్ ఆన్ ట్రైన్స్, సేఫ్ క్యాంపస్ జోన్, వజ్ర ప్రహార్ వంటి కార్యక్రమాల గురించి వివరించారు. అలాగే గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక సమస్యలు, యువత భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. గంజాయి అక్రమ రవాణా లేదా మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఈగల్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది మరియు సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని అధికారులు సూచించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## ప్రమాద భరిత చింత చెట్టును తొలగించుటకు చర్యలు తీసుకున్న పి డి ఓ





**వై రామవరం, పెన్ పవర్, ఆగస్టు 5 :** మండలంలో చవిటి దిబ్బలు గ్రామంలో ప్రమాద భరితంగా ఉన్న చింత చెట్టును బుధవారం అధికారులు ఆదేశాల మేరకు తొలగించడం జరిగిందని పిడిఓ పి.రాహుల్ సత్యానంద రెడ్డి తెలిపారు.

ఆయన తెలిపిన వివరాల ప్రకారం లూథరన్ ఎయిడెడ్ పాఠశాల, అంగన్వాడి కేంద్రం, ఏ ఎన్ ఎం సబ్ సెంటర్ మధ్యలో ఉన్న చింత చెట్టును విద్యా కమిటీ పర్యవేక్షణలో తొలగించడం జరిగిందని తెలిపారు. ఈ చింత చెట్టుపై వలస పక్షులు ( కొంగలు) ఈ సీజన్లో సంతానోత్పత్తి చేసుకొని వెళ్లిపోతుంటాయని తెలిపారు. ఈ చింత చెట్టుపై నివాసం ఏర్పరచుకున్న కొంగలు విసర్జించే రెట్టల వలన, దాని వల్ల వచ్చే వాసన ప్రమాద భరితంగా ఉంటుందని గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఫిర్యాదు మేరకు తొలగించడం జరిగిందని తెలిపారు. ఈ చింత చెట్టును తొలగించడంతో గ్రామస్తులు విద్యార్థులు తల్లిదండ్రులు విద్యార్థులు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వెన్నెల సుబ్బారెడ్డి, పల్లాల మంగిరెడ్డి, బచ్చుల వెంకట్ రెడ్డి పాల్గొన్నారు అని తెలిపారు.

## ఐదు నెలల జీతాలివ్వరా?..

-ఎంఈఓ కార్యాలయం వద్ద ఆయాల ధర్నా



**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు5.** గత ఐదు నెలలుగా బకాయి పడ్డ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పాఠశాల ఆయాలు,శానిటేషన్ సిబ్బంది బుధవారం కూనవరం ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు.ముందుగా టేకులుబోరు సిపిఎం కార్యాలయం నుండి ర్యాలీగా వచ్చి ఎంఈఓ లక్ష్మీనారాయణ కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షురాలు పైదా దుర్గా,కన్వీనర్ సీత మాట్లాడుతూ రెక్కాడితే గానీ డొక్కాడని పేద కార్మికులకు 5 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం దారుణం.వేతనాలు అందక కుటుంబాలు గడవడం కష్టంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.గత 5 నెలల వేతనాలు వెంటనే ఆయాల ఖాతాల్లో జమ చేయాలి,
నిత్యావసర ధరలకు అనుగుణంగా ప్రతి ఆయాకు నెలకు 26వేలు ఇవ్వాలి,సిబ్బందిపై జరుగుతున్న రాజకీయ వేధింపులు ఆపాలని అన్నారు.ఆయాలకు సమాజంలో తగిన గుర్తింపు,యూనిఫాం ఇవ్వాలి.అధికారులు నిర్లక్ష్యం వీడకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆయాలు,సిఐటియు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## గ్యాస్,సిలిండర్లు,వినియోగదారులకు సరఫరాచేయడంలో,తీవ్రజాప్యం



**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.5** మండలంలో హెచ్.పి.గ్యాస్, సిలిండర్లు,వినియోగ దారులకుసరఫరాచేయడం లో,తీవ్రజాప్యంజరుగు తుందని, నానాఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పలువురుఆరోపిస్తున్నారు. వారంపదిరోజులక్రితం గ్యాస్,సిలిండర్,బుక్ చేసినప్పటికీ,డెలివరీ,చేయ కపోవడంతో,వినియోగదారులు మండి పడ్డారు. వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీని సంప్రదించిన ప్పటికీ,సిలిండర్ ఎప్పుడు వస్తుందనే విషయంపై స్పష్టమైన సమాచారం ఇవ్వడంలేదని,ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రతిరోజు సిలిండర్ కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి,ఏర్పడిందని,వినియోగదారులు ఆవేదనవ్యక్తంచేశారు.గొప్పవిషయంఏమిటీఅంటే సి లిండర్ ఇంటికిచేరక,ముందేడెలివరీ చేసినట్లుమొబైల్ ఫోన్లకు సందేశాలు వస్తున్నాయని,ఏజెన్సీ రికార్డుల్లో కూడా పంపిణీ పూర్తయినట్లు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.సిలిండర్ అందకుండానే డెలివరీ,చూపించడం వినియోగదారులను మోసం చేయడమేనని,వినియోగదారులు,ఆగ్రహంవ్యక్తం చేశారు.ఈ విషయంపై సంబంధితఅధికారులకు వినియోగదారులు,ఫిర్యాదుచేసినప్పటికీ ఆశించిన స్థాయిలోస్పందనలేదని,పలువురుఆరోపిస్తున్నారు. గ్రామీణప్రాంతాల్లోజీవిస్తున్న,గ్యాస్,వినియోగదారు లకు,గ్యాస్,కొరతలేకుండాచూడవలసినభాద్యత, సంబంధితఅదికారులుపైనలేదాఅంటూవినియో గదారులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా గ్యాస్ ఏజెన్సీ అధికారులు స్పందించి,పెండింగ్‌లో ఉన్న సిలిండర్లను తక్షణమే వినియోగదారులకుఅందజేయాలని,డెలివరీ వ్యవస్థలో,పారదర్శకత పాటించాలని,ప్రజలు కోరుతు న్నారు.

# కూటమి పాలనలో రాష్ట్రం ప్రగతి పథంలో



ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు

**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 5:** కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు సాగుతోందని ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి భాస్కర్ సూచనల మేరకు ఎటపాక మండల పరిధిలోని గౌరీదేవిపేట పంచాయతీలో బుధవారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో రాష్ట్ర అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని, ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతోందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంతో పాటు గ్రామాలు కూడా అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజలు ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉలవల శివకనకరాజు, మాజీ ఉప సర్పంచ్ మడకం నరసింహారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు అమరవరపు రాము, చుండ్రు రాజా, బుడిపిటి కృష్ణార్జునరావు, గవ్వల వెంకటేష్, మార్త చంటి, కాచర్ల మల్లేశ్వరరావు, మల్లెల లక్ష్మణరావు, దార భరత్, ముక్కెర భద్రరావు, ములకలపల్లి నితిన్, మల్లెల సాయి, కొరకాసుల పండు తదితరులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## మద్రిపాలెంలో టీడీపీ యూనిట్ స్థాయి సమావేశం



పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై చర్చ

**గంగవరం, పెన్ పవర్ ఆగస్టు 5:** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు అభివృద్ధి వివరాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకొని వెళ్లాలని మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ సూచించారు.గంగవరం మండలం మద్రిపాలెం గ్రామంలో బుధవారం తెలుగుదేశం పార్టీ యూనిట్ స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే ఈ సమావేశానికి ఐదో యూనిట్ ఇన్‌చార్జి, మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ అధ్యక్షత వహించారు.సమావేశంలో పార్టీ బలోపేతం, గ్రామ స్థాయిలో సంస్థాగత నిర్మాణం, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం, పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాలపై నాయకులు చర్చించారు. గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ నర్సి సూరమ్మ, బూత్ కన్వీనర్లు సుంకాపు నూకారెడ్డి, పల్లాల వీరభద్రారెడ్డి, మడకం సాయిబాబు దొర, రేవుల అబ్బాయిరెడ్డి, పల్లాల చిన్నకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీని అడ్డుకునే కుట్రలు ప్రజలు గమనిస్తున్నారు

- నిరుద్యోగ యువత భవిష్యత్తుతో రాజకీయాలు చేయొద్దు
- మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు



**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 5:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియను అడ్డుకునేందుకు జరిగిన ప్రయత్నాలు విఫలమయ్యాయని, నిరుద్యోగ యువత భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం తగదని తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు అన్నారు.బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ హైకోర్టును ఆశ్రయించిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు తమ ఆరోపణలకు తగిన ఆధారాలు సమర్పించడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. సరైన ఆధారాలు లేకుండా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించడం న్యాయవ్యవస్థ పారదర్శకతకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.
ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ ద్వారా సుమారు 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్నాయని, దీంతో వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఇలాంటి కీలక నియామక ప్రక్రియను రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డుకునే ప్రయత్నాలు సమంజసం కాదన్నారు.ప్రతిపక్షాలు రాజకీయాలకు అతీతంగా నిరుద్యోగ యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా మెగా డీఎస్సీ నియామక ప్రక్రియను కొనసాగిస్తోందని ఆయన పేర్కొన్నారు.

## మధ్యవర్తిత్వంతో వివాదాలకు శాశ్వత పరిష్కారం

'మీడియేషన్ ఫర్ నేషన్ 3.0'లో భాగంగా వాక్, బైక్ ర్యాలీ నిర్వహించిన జడ్జి మురళీ గంగాధరరావు





**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ ఆగస్టు 5:** వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం (మీడియేషన్) అత్యుత్తమ మార్గమని, కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకోవడం కంటే పరస్పర అంగీకారంతో వివాదాలను పరిష్కరించుకోవడం ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని రంపచోడవరం మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ మురళీ గంగాధరరావు అన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు బుధవారం రంపచోడవరంలో 'మీడియేషన్ ఫర్ నేషన్--3.0' కార్యక్రమంలో భాగంగా న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో కలిసి 1కే వాక్ మరియు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియేషన్ స్టాల్ను సందర్శించి, ప్రజలకు మధ్యవర్తిత్వ విధానంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మేజిస్ట్రేట్ మురళీ గంగాధరరావు మాట్లాడుతూ, కుటుంబ, ఆస్తి, పౌర వివాదాలతో పాటు పలు రకాల కేసులను మీడియేషన్ ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా ఇరు పక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం లభించడంతో పాటు, దీర్ఘకాలిక న్యాయపోరాటాలు, అధిక వ్యయభారం, కాలయాపన నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. అప్పీలు అవసరం లేని శాశ్వత పరిష్కారం మీడియేషన్ ద్వారా సాధ్యమవుతుందని వివరించారు.ప్రజలు వివాదాలను కోర్టు విచారణలకు మాత్రమే పరిమితం చేయకుండా మధ్యవర్తిత్వాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సామరస్య వాతావరణాన్ని పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.వి.ఆర్. ప్రకాష్, ఏ.ఆర్.ఆర్. భగవాన్, టి. వీరబాబు, వై. శ్రీనివాసరావు, చి. సంతోష్ కుమార్, కొమ్మన శివరంజని, ఎం. బాల సత్యనారాయణ, డి. లక్ష్మీనారాయణ, ఎం.డి. జిలానీ, పోలీసు సిబ్బంది, కోర్టు సూపరింటెండెంట్ నాగభూషణం, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## షాట్ పుట్ లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్న దాలిపాడు విద్యార్థిని






**వై రామవరం, పెన్ పవర్, ఆగస్టు 5:** అమరావతి ఛాంపియన్షిప్ 2026 లో భాగంగా రంపచోడవరంలో జరిగిన స్పోర్ట్స్ లో షాట్ పుట్ విభాగంలో మండలం లో దాలిపాడు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కే ప్రణీత ప్రథమ స్థానం సాధించిందని పిడి మంగయమ్మ తెలిపారు.

అమరావతి ఛాంపియన్షిప్ 2026 లో భాగంగా పోలవరం జిల్లా రంపచోడవరం లో జరిగిన స్పోర్ట్స్ మీట్లో షాట్ పుట్ విభాగంలో దాలిపాడు జి టి డబ్ల్యూ ఏజిహెచ్ఎస్ పాఠశాల లో 9వ తరగతి చదువుతున్న కే ప్రణీత ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈ విద్యార్థిని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు లో జరిగే స్పోర్ట్స్ లో పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థిని విజయం పట్ల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# పులి కోసం అత్యంత జాగ్రత్తగా అన్వేషణ






**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఆగష్టు, 5;** దర్భ గూడెం జామాయిల్ ప్లాంటేషన్లో పులి కోసం అటవీ శాఖ అధికారులు బుధవారం ముమ్మరంగా అన్వేషిస్తున్నారు. అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏలూరు, రాజమండ్రి, కాకినాడ, చింతూరు, పాపికొండ నేషనల్ పార్క్ ప్రాంతాలలో సంచరిస్తున్న పులిని సురక్షితంగా బంధించేందుకు అటవీ శాఖ తన ప్రయత్నాలను మరింత ముమ్మరం చేసిందని జిల్లా అటవీ శాఖాధికారి పి .వి. సందీప్ రెడ్డి చెప్పారు. ఇప్పటికే మహారాష్ట్ర (వార్ధా, పుణే) బృందాలతో పాటు బెంగళూరు నుండి 'వైల్డ్ లైఫ్ నిపుణుల బృందాన్ని, వార్ధా నుండి 'పీపుల్ ఫర్ యానిమల్స్ బృందాన్ని మరియు వివిధ టైగర్ రిజర్వ్ నుండి అనుభవజ్ఞులైన ప్రత్యేక బృందాలను రంగంలోకి దించామన్నారు. మత్తుమందు తుపాకీలతో పులిని బంధించడంలో నైపుణ్యం ఉన్న ఆరుగురు (6) ట్రాంక్విలైజింగ్ షూటర్లను సిద్ధంగా ఉంచామన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని తాను, రాజమండ్రి అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ డా. టి. జ్యోతి క్షేత్రస్థాయిలో పర్యటించి ఆపరేషన్ను పరిశీలించామన్నారు. పులి చాలా చురుగ్గా, చాకచక్యంగా ప్రవర్తిస్తూ మానవ సంచారం ఉన్న ప్రాంతాలను మరియు ప్రత్యేకంగా అమర్చిన మంచెలను గమనిస్తూ తప్పించుకుంటూ ప్రయాణిస్తోందని, అయినప్పటికీ, నిపుణుల బృందాలు పక్కా వ్యూహంతో రాత్రింబవళు శ్రమిస్తున్నాయన్నారు. పులి లొకేషన్ వివరాలు, పాదముద్రలు మరియు కెమెరా ట్రాప్ల డేటాను నిరంతరం పరిశీలిస్తూ వైల్డ్లైఫ్ ట్రాకింగ్లో ఉపయోగించే వివిధ రకాల అధునాతన శోధన పద్ధతులను అమలు చేస్తున్నామన్నారు. పులి కదలికలను నియంత్రించడానికి ఆ ప్రాంతాన్ని ఇన్నర్ ఔటర్, రెక్టాంగిల్స్గా విభజించి రెండు అంచెల వ్యూహం తో ముట్టడి ఏర్పాట్లు చేశామన్నారు. నాలుగు వైపులా ప్రత్యేకంగా ఎరలు అమర్చి, వాటి ద్వారా పులిని నిర్ణీత ప్రాంతానికి ఆకర్షించేలా ప్రణాళిక చేశామన్నారు. ఎరల వద్దకు పులి రాగానే దానిని సురక్షితంగా మత్తుమందు ద్వారా బంధించేందుకు నలుగురు నైపుణ్యం కలిగిన షూటర్లను, వెటర్నరీ బృందాలను రంగంలోకి దించామన్నారు. ఎంటైర్ డివిజన్ ఫారెస్ట్ స్టాఫ్, టెరిటోరియల్, వైల్డ్లైఫ్ విభాగాలు మరియు స్థానిక గ్రామస్తులతో కలిపి దాదాపు 350 మందికి పైగా ఈ ఆపరేషన్లో రాత్రింబవళ్లు పాల్గొంటున్నారని సందీప్ రెడ్డి చెప్పారు. క్షేత్రస్థాయిలో క్షణక్షణం సమాచారాన్ని మార్పిడి చేసుకోవడానికి వాకీ-టాకీలు మరియు కమ్యూనికేషన్ నెట్వర్క్లు వినియోగిస్తున్నామని, పులి చివరగా కనిపించిన ప్రధాన కేంద్ర స్థానం నుండి అన్ని వైపులా వ్యాపించేలా స్టార్ ఆకారంలో బృందాలను రంగంలోకి దించామన్నారు. పులి ముందుకు సాగే సాధ్యమయ్యే మార్గాలను కవర్ చేస్తూ సరిహద్దు ప్రాంతాలలో యూ ఆకారంలో గాలింపు కొనసాగిస్తున్నామన్నారు. ఈ ప్రత్యేక నమూనాలతో పాటు థర్మల్ డ్రోన్లు, నైట్ విజన్ కెమెరాలు మరియు నిపుణులైన ట్రాకింగ్ టీమ్లతో అన్ని రకాల సాంకేతిక పద్ధతులను వినియోగిస్తున్నామన్నారు. వలలతో చుట్టూ రక్షణగా ఫెన్సింగ్ వేస్తూ, పులిని నిర్దేశిత మార్గంలోకి డ్రైవ్ చేస్తున్నామన్నారు. ప్రతిరోజూ పులి సంచారాన్ని నిరంతరం ట్రాక్ చేస్తూ దర్భగూడెం, పి. రాజవరం, చెల్లావారిగూడెం, ఎ. పోలవరం, అప్పలరాజుగూడెం, సిరివారిగూడెం, రామన్నపాలెం, మడకవారిగూడెం, దాట్లవారిగూడెం, శ్రీరత్నగూడెం, సీతాంపేట మరియు సమీప గ్రామాల ప్రజలను డప్పు చాటింపులు మరియు మైక్ అనౌన్స్మెంట్ల ద్వారా అప్రమత్తం చేస్తున్నామన్నారు. కన్నాపురం, పోలవరం, కుకునూరు మరియు జంగారెడ్డిగూడెం ఫారెస్ట్ రేంజ్ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పూర్తి అప్రమత్తతతో ఉన్నామని, ప్రజలు కూడా భయాందోళన చెందకుండా అటవీ శాఖ సూచనలు పాటిస్తూ సహకరించాలని సందీప్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన



**ఆత్రేయపురం, పెన్ పవర్ ఆగస్టు 5:** ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రం--11లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ కె. పద్మావతి తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించారు. శిశువు జన్మించిన తొలి గంటలోపే తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని, తల్లిపాలే బిడ్డకు తొలి టీకా వంటివని ఆమె తెలిపారు. పుట్టినప్పటి నుంచి తొలి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం పోషకాహారాన్ని ప్రారంభించినప్పటికీ రెండేళ్ల వయస్సు వరకు తల్లిపాలను కొనసాగించడం ద్వారా పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని వివరించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయని చెప్పారు.

అనంతరం తల్లులు అడిగిన సందేహాలకు సమాధానాలు ఇస్తూ, తల్లి ఆరోగ్యం, శిశు సంరక్షణ, సమతుల్య ఆహారం, పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. తల్లులు ప్రభుత్వ సూచనలను పాటిస్తూ పిల్లల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ కె. పద్మావతి, ఏఎన్ఎం ఎన్.వి. నాగలక్ష్మి, ఆశా కార్యకర్త డి. వెంకటలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు సి.వి.వి.ఎల్. లావణ్య, డి. వీరవేణి తదితరులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం- సీడీపీవో పర్వత వెంకటలక్ష్మి....

- మొదటి ఆరు నెలలు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని,
- కత్తిపూడిలో తల్లిపాల వారోత్సవాల పై అవగాహన





**శంఖవరం పెన్ పవర్ ఆగష్టు 05:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి గ్రామం లోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సీడీపీవో పర్వత వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మొదటి ఆరు నెలల పాటు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, తల్లిపాలే ఆహారం,తల్లిపాలే నీరు అని అవగాహన కల్పించారు. పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం ప్రారంభించాలని, తేనె,పశువుల పాలు,ఇతర పానీయాలు, డబ్బా పాలు ఇవ్వకూడదని సూచించారు. బిడ్డకు అవసరమైన నీరు, పోషకాలు తల్లిపాలలోనే లభిస్తాయని వివరించారు. ఉద్యోగాలకు వెళ్లే మహిళలు శుభ్రమైన పాత్రలో పాలను సేకరించి ఫ్రిజ్లో నిల్వ చేసి 24 గంటల్లోపు కప్పు లేదా చెంచాతో బిడ్డకు ఇవ్వవచ్చని సూచించారు. తల్లిపాలు బిడ్డకు శక్తిని,ఆరోగ్యాన్ని అందించడంతో పాటు తల్లికీ అనేక ప్రయోజనాలు కలిగిస్తాయని వివరించారు. పాల ఉత్పత్తికి శరీరం అదనపు కేలరీలను ఖర్చు చేయడం ద్వారా గర్భధారణ సమయంలో పెరిగిన బరువు తగ్గేందుకు దోహదపడుతుందని,కొన్ని రకాల క్యాన్సర్లు, దీర్ఘకాలిక వ్యాధుల ముప్పును తగ్గిస్తుందని తెలిపారు. తల్లిపాలు ఇచ్చే సమయంలో విడుదలయ్యే ఆక్సిటోసిన్, ప్రోలాక్టిన్ హార్మోన్లు ఒత్తిడి,ఆందోళనను తగ్గించి మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ బివి రజని,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్నవరం సత్యదేవుని అన్నదానానికి రూ.1,00,006/- విరాళం



**అన్నవరం,పెన్ పవర్ ఆగస్టు. 5:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి తాడేపల్లి గూడెం చెందిన పట్నాల నాగమణి రూ.ం1,00,006/- లిలను విరాళంగా అందజేశారు. దాత సమర్పించిన విరాళాన్ని దేవస్థానం అధికారులు స్వీకరించి, ఆమె భక్తి భావాన్ని అభినందించారు. ఈ సందర్భంగా శ్రీ సత్యదేవుని దర్శనం, ప్రత్యేక ప్రసాదం అందజేసి ఆశీర్వచనాలు అందించారు.

దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి భక్తులు అందిస్తున్న విరాళాలు వేలాది మంది యాత్రికులకు అన్నప్రసాదం అందించడంలో ఎంతో దోహదపడుతున్నాయని అధికారులు తెలిపారు. భక్తులు ఇలాంటి సేవా కార్యక్రమాలకు మరింతగా సహకరించాలని దేవస్థానం విజ్ఞప్తి చేసింది.

## గెద్దనాపల్లిలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు.





- తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యంతోపాటు తల్లికి ఎంతో శ్రేయస్కరం.
- జగ్గంపేట ఐసిడిఎస్,సిడిపిఓ,ఎం పూర్ణిమ.

**కిర్లంపూడి,పెన్ పవర్ ఆగస్టు, 05:** తల్లి పాలతోనే తల్లి, బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని జగ్గంపేట ఐసిడిఎస్, సిడిపిఓ, ఎం పూర్ణిమ అన్నారు. కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి అంగన్వాడీ కేంద్రంలో జగ్గంపేట ఐసీడీస్ సిడిపిఓ,ఎం పూర్ణిమ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం తల్లులకు తల్లిపాలు యొక్క విశిష్టతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ తల్లి పాలు- శిశువుకు తొలి టీకా మాత్రమే కాకుండా,సంపూర్ణ ఆహారం" అని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొందన్నారు. శిశువు పుట్టిన వెంటనే మొదటి గంటలోనే తల్లి పాలు ఇవ్వాలని,మొదట వచ్చే పసుపు రంగు పాలు (కొలస్ట్రం) శిశువుకు అమూల్యమైన రక్షణ కవచమన్నారు. ఇవి శిశువులో రోగనిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధుల బారి నుండి కాపాడుతాయన్నారు.

శిశువు పుట్టిన తర్వాత మొదటి ఆరు నెలలు తల్లి పాలు మాత్రమేఇవ్వాలన్నారు. ఆరు నెలల తర్వాత ఇంటి ఆహారంతో పాటు రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లి పాలను కొనసాగించడం తల్లి,బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం అన్నారు. తల్లి పాల వల్ల శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందడమే కాకుండా రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. మెదడు ఎదుగుదల మెరుగుపడడమే కాకుండా, ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందన్నారు. తల్లికి కూడా శిశువుకు పాలు ఇవ్వడం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు.

ప్రసవానంతరం త్వరగా కోలుకోవడం, రక్తస్రావం తగ్గడం, రొమ్ము, అండాశయ క్యాన్సర్ల ప్రమాదం తగ్గడం వంటి ప్రయోజనాలు లభిస్తాయన్నారు. కుటుంబ సభ్యులు తల్లికి అవసరమైన విశ్రాంతి, పోషకాహారంతోపాటు మానసిక ధైర్యాన్ని అందించాలన్నారు. మనమందరం కలిసి ప్రతి శిశువుకు తల్లి పాల హక్కు అందేలా కృషి చేద్దాం. ఆరోగ్యవంతమైన పిల్లలు, ఆరోగ్యవంతమైన కుటుంబాలు ఉండేలా కృషి చేద్దాము అన్నారు.

ఈ సందర్భంగా 6 నెలలు నిండిన 3 మంది పిల్లలకు అన్న ప్రాసన చేసారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూరిశెట్టి వెంకట శివ, గుడాల చిట్టిబాబు, సూపర్వైజర్ బూసమ్మ అంగన్వాడీ టీచర్ లు, తల్లులు పాల్గొన్నారు.

## శంఖవరం పంచాయతీ షాపుల లీజుల అడ్వాన్స్ రెండేళ్ళు ఎవ్వరి వద్ద మూలిగాయి....

ఇంకనూ రెండు షాపులకు లీజుదారులు చెల్లించిన అడ్వాన్స్ ఎందుకు జమ కాలేదు....

పంచాయతీ అధికారులను ప్రశ్నిస్తున్న శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు మేకల కృష్ణ....



**శంఖవరం పెన్ పవర్ ఆగష్టు 05:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రం శంఖవరంలో గల మార్కెట్ లో పంచాయతీకు చెందిన 22 షాపులకు లీజు దక్కించుకున్న లీజుదారులు చెల్లించిన అడ్వాన్సు రెండేళ్ళుగా ఎందుకు ప్రభుత్వ ఖాతాలో జమ చేయలేదని, తాము అడిగిన తర్వాతే చెల్లించడం ఏమిటని, ఇప్పటి వరకు ఆ సొమ్ము ఎవ్వరి వద్ద మూలిగిందో పంచాయతీ అధికారులు తేటతెల్లం చేయాలని శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం ప్రశ్నించింది. సంఘం అధ్యక్షుడు మేకల కృష్ణ నివాస గృహంలో సంఘం సభ్యులు పర్వత రామకృష్ణ, గునపర్తి అపురూప్, పగడాల బాబ్జి, బొమ్మిడి చిట్టిబాబు, రేలంగి సత్యనారాయణ కానేటి వెంకటరమణ బత్తిన తాతాజీ కొంగు రమేష్ పాల్గొని విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కృష్ణ మాట్లాడుతూ మార్కెట్ లో 22 షాపులను 15వ ఆర్థిక సంఘం నిధులతో 2023లో నిర్మించారన్నారు. వీటికి 1.7.2024 నుండి 30.6.2027 వరకు మూడేళ్ళ కాలానికి వేలం నిర్వహించారు. ఆయా షాపులకు వాటి డిమాండ్ ను బట్టి ఒక్కొ దానికి ఒక విధంగా డిపాజిట్ లను వసూలు చేసారు. ఆ వసూలు చేసిన సొమ్మును సమాచార హక్కు చట్టం ద్వారా డిసెంబర్ లో తాను అడిగిన తర్వాత ఫిబ్రవరి 2026 నుండి ఒక్కొక్క షాపుకు ఒక్కొక్క తేదీన ప్రభుత్వ ఖాతాకు జమ చేసినట్లుగా చలానాలు వెల్లడిస్తున్నాయి. ఇంకనూ 3 షాపులకు పూర్తిగానూ, కొన్ని షాపులకు డిపాజిట్లు బకాయిలు ఉన్నాయన్నారు. లీజుదారులు వేలం దక్కించుకున్న వెంటనే డిపాజిట్లు చెల్లించినప్పటికీ ప్రభుత్వ ఖాతాకు జమ చేయకపోవడం అధికారుల అలసత్వమా... లేక ఎవ్వరైనా వీటిని తమ సొంత ప్రయోజనాల కోసం రెండేళ్ళుగా వాడుకున్నారా... దీనిపై శంఖవరం గ్రామ ప్రజలకు అనుమానాలు ఉన్నాయని, వీటిని నివృత్తి చేయవలసిన బాధ్యత పంచాయతీ అధికారులకు ఉందని కృష్ణ అన్నారు. అనంతరం విలేకర్లకు తాను సమాచార హక్కు చట్టం ద్వారా పంచాయతీ అధికారులు డిపాజిట్లను ప్రభుత్వ ఖాతాకు జమ చేసిన చలానాల నకళ్ళను, ఇతర సమాచారాన్ని అందించారు. వీటిపై ఉన్నతాధికారులు పూర్తి దర్యాప్తు నిర్వహించి, ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం, డిపాజిట్లు జమ చేయడంలో నిర్లక్ష్యం చేసిన వారిపైన తగిన చర్యలు చేపట్టాలని శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం డిమాండ్ చేసింది.